Visakha
Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారము

WANTED
Office Assistant-1
Jr. Accountant-1
For an Audit Firm
at Seethammadhara
Call : 95334 94102

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 125 విశాఖపట్నం, 23 ఫిబ్రవరి 2024 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## ముగిసిన టీడీపీ-జనసేన సమన్వయ కమిటీ సమావేశం

టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి సమన్వయ కమిటీ సమావేశం విజయవాడలో ముగిసింది. ఈ సమావేశంలో రెండు తీర్మానాలకు ఆమోదం తెలిపారు. పొత్తును స్వాగతించిన టీడీపీ-జనసేన కేడరను అభినందిస్తూ ఒక తీర్మానం మీడియాపై దాడులను తప్పుబడుతూ రెండో తీర్మానం చేశారు.

సమన్వయ కమిటీ సమావేశం అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నాశనం అయ్యాయని, వైసీపీ ప్రభుత్వం మన రాష్ట్రం పరువు తీసిందని అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పుకోలేక పోతున్నారని, వైసీపీ పాలనను ప్రజలంతా అసహ్యించుకుంటున్నారని అన్నారు.

టీడీపీ-జనసేన మధ్య గొడవలు పెట్టేందుకు జగన్ కుట్రలు పన్నుతున్నారని అచ్చెన్నాయుడు విమర్శించారు. ఓడిపోతామని తెలిసి రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు జగన్ యత్నిస్తున్నారని ఆరోపించారు. అందుకే వైసీపీ నేతలు మీడియాపై దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. తమ సభలకు వచ్చే వారిని అనేక విధాలుగా ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమన్వయ కమిటీ సమావేశంలో మీడియాపై దాడులను ఖండిస్తూ తీర్మానం చేశామని అచ్చెన్న వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో బీజేపీతో మాట్లాడుతున్నామని, త్వరలోనే పొత్తు గురించి ప్రకటన ఉంటుందని వెల్లడించారు. టీడీపీని ఎన్డీయేలోకి ఆహ్వానించారని, త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందని అన్నారు.

ఇక, సాధ్యమైనంత త్వరగా ఉమ్మడి మేనిఫెస్టోను

(మిగతా 2లో)

## కేంద్రంలో మరోసారి, బీజేపీ సర్కార్

**పాడేరు, (విశాఖ సమాచారము):** కేంద్రంలో మరోసారి, అంధ్రలో ఒక్క సారి బీజేపీకి అధికారం ఇచ్చి అభివృద్ధికి సహకరించాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కురుస ఉమా మహేశ్వరరావు అన్నారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుపుతున్న ప్రజా పోరు యాత్ర -2 లో భాగంగా పాడేరు మండలం గుత్తుల పుట్టు సంతబయలు వద్ద నిర్వహించిన సమావేశం లో అయన మాట్లాడారు, ఇప్పటి వరకు మన్యంలో జరిగిన అభివృద్ధి అంత బీజేపీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు తోనే జరిగిందన్నారు, కావున ఈ సారి జరిగే ఎన్నికల్లో బీజేపీ పార్టీ కి మద్దత్తు ఇవ్వాలని అయన కోరారు, వైసీపీ పాలన లో స్థానిక ప్రజా ప్రతినిధులను కీలు బొమ్మలుగా మార్చిన ఘటనను ప్రజలు మరువ రాదన్నారు. ఎస్టీ ఎస్సి సబ్ ప్లాన్ నిధులను సైతం దారి మల్లించి గిరిజన అభివృద్ధి నీ గాలికి వదిలేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేల్లా పాలనలో నిరుద్యోగ యువతను నిరాశ నిస్పృహల్లో ముంచారాని పేర్కొన్నారు, వైసీపీ ఇటీవల ప్రకటించిన దగా డిఎస్సిని రద్దు చేసి, మెగా డిఎస్సిని విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు. గిరిజన నిరుద్యోగ యువత చేతుల్లో వైసీపీ ఓటమి కాయమని అయన జోస్యం చెప్పారు,అనంతరం బీజేపీ గిరిజన మోర్చా మేధావుల విభాగం రాష్ట్ర కన్వినర్ కురుస పార్వతమ్మ మాట్లాడుతూ 500ల కోట్ల రూపాయలతో పాడేరు కేంద్రంగా మెడికల్ కళాశాలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి, త్వరతగిన రీతిలో నిర్మాణం చేపడు తుందని, దీనివలన విశాఖపట్నం వెళ్లే పరిస్థితి ఉండదని అన్నారు, అలాగే పాడేరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి కూడా నాడు నేడు కింద ప్రత్యేక నిధులు విడుదల చేసి ఆధునిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఏకలవ్య విద్యాలయాలు మంజూరు చేసి గిరిజన విద్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించిందని అన్నారు, వన్ డన్ వికాస్ కేంద్రాల ద్వారా గిరిజన మహిళలకు, యువతులకు ఉపాధి అవకాశాలను నరేంద్ర మోదీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. మండలంలో నిర్మించిన

(మిగతా 2లో)

## వైఎస్ షర్మిల అరెస్టు-జగన్ సర్కార్‌లో ఇదే తొలిసారి

ఏపీలో వైసీపీ గతంలో ఇచ్చిన 23 వేల పోస్టుల మెగా డీఎస్సీ హామీని నిలబెట్టుకోకుండా కేవలం 6000 పోస్టులతో డీఎస్సీ ప్రకటన చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఛలో సెక్రటేరియట్ ఉద్రిక్తతలకు దారి తీసింది.

సెక్రటేరియట్‌కు బయలుదేరిన వైఎస్ షర్మిను పోలీసులు ఉండవల్లి వద్ద అడ్డుకున్నారు. దీంతో అమె రోడ్డుపైనే నిరసనకు దిగారు. పోలీసులు ఎంత నచ్చచెప్పినా వెనక్కి వెళ్లేందుకు అంగీకరించకపోవడంతో అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు.

6వేల పోస్టులతో డీఎస్సీ ప్రకటన నిరుద్యోగులను మోసం చేయడమేనని ఆరోపిస్తూ ఛలో సెక్రటేరియట్‌కు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఉదయం నుంచే ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఛలో సెక్రటేరియట్‌ను అడ్డుకునేందుకు పోలీసులు నిన్న రాత్రి నుంచే కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకోవడం మొదలు పెట్టారు. దీన్ని గమనించిన వైఎస్ షర్మిల విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ లోనే రాత్రి బస చేశారు.

ఉదయం విజయవాడ నుంచి సచివాలయానికి

వైఎస్ షర్మిల పాదయాత్రగా బయలుదేరారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో కలిసి షర్మిల చేపట్టిన పాదయాత్ర ఎలూరు

(మిగతా 2లో)

## "కురుపాం" మార్కెట్‌ను సమన్వయంతో అభివృద్ధి చేయండి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారము):** పాత నగరంలో అతి పురాతనమైన బ్రిటిష్ వారితో నిర్మించబడిన కింగ్ ఎడ్వర్డ్ కార్పొషన్ మెమోరియల్ కురుపాం మార్కెట్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కు 39వ వార్డు వైసీపీ ఇన్చార్జ్ కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ తిత్తి కృష్ణ సమక్షంలో సభ్యులంతా కలిసి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముందుగా మాలవేసి సాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యనిర్వాహణాధికారి శేఖర్ బాబు సమక్షంలో చైర్మన్ కృష్ణ, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ కృష్ణ, సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కల్పించిన ఈ అవకాశం, బాధ్యతను సమన్వయంతో పనిచేసి వైసీపీకి పేరు ప్రఖ్యాతలు తెచ్చే విధంగా జగనన్న ఆశయాలు అనుగుణంలో "కురుపాం" మార్కెట్ మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ వైసిపి జెండా మోసి నిస్వార్థంగా పార్టీకి సేవలందించిన వారందరికీ గుర్తింపు ఇచ్చామని తెలిపారు. ఆశయం కోసం సహనంతో పని చేయండి. జగన్ హయాంలో ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. మళ్లీ 30 ఏళ్లు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారన్నారు. దైవత్వం కలిగిన మంచి నాయకులను గుర్తించి పురాతనమైన "కురుపాం" ప్రసిద్ధిని పెంచేందుకు

(మిగతా 2లో)

## ఇందిరా ప్రియదర్శిని స్టేడియంను త్వరితగతిన ఆధునీకరించండి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారము):** మహా విశాఖ నగరంలో గల ఇందిరా ప్రియదర్శిని స్టేడియంను అధునాతనంగా ఆధునీకరించి వినియోగంలోకి త్వరితగతిన తీసుకురావాలని జివిఎంసి కమీషనర్ సిఎం. సాయి కాంత్ వర్మ అన్నారు. గురువారం ఆయన జివిఎంసి అధికారులతో కలసి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం అభివృద్ధి పనులను పరిశీలించారు.

ముందుగా కమీషనర్ మాట్లాడుతూ ఇందిరా ప్రియదర్శిని స్టేడియం విశాఖ నగరంలో అతి పెద్దదని, ఈ స్టేడియం నందు అంతర్జాతీయ క్రీడలు జరిగి ఉన్నాయని, రానున్న రోజులలో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ క్రీడలు జరుగ నున్నందున అందుకు సిద్ధంగా ఈ స్టేడియంను మరింత అభివృద్ధి పరచి ఆధునీకరణతో తీర్చిదిద్ది వినియోగంలోనికి త్వరితగతిన తీసుకురావాలని అధికారులకు కమీషనర్ సూచించారు. అనంతరం స్టేడియం లోపల జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి ఆడియన్స్ గేలరీ, విద్యుత్ స్తంబాలు, గ్రిల్స్, స్కోర్ బోర్డు బిల్డింగ్, గార్డెనింగ్, పెయింటింగ్, లైటింగ్ మొదలగు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఆడియన్స్ ప్రధాన గేలరీకి ఆనుకొని వున్న హాల్స్, గదుల నందు ఇండోర్ గేమ్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం స్టేడియం గేలరీల వెనుక భాగంలో గల ఖాళీ ప్రదేశాలలో టెన్నిస్, బాడ్మింటన్, వాలీ బాల్ తదితర క్రీడా సంబంధిత కోర్ట్ లను, పార్కింగ్ స్థలం, కెఫెటేరియా, ల్యాండ్ స్కేపింగ్,

(మిగతా 2లో)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
దేవదాయ-ధర్మదాయ శాఖ
శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం
ఇంద్రకీలాద్రి, విజయవాడ.
అందరికీ
శుభ ఆహ్వానం

అవధాన సరస్వతీ పీఠాధీశ - బృహత్ ద్విసహస్రావధాని
బ్రహ్మశ్రీ డా॥ మాడుగుల నాగఫణి శర్మ వారిచే
శ్రీదుర్గా సౌందర్యలహరి మహాశతావధానం
ది.26.02.2024, సోమవారము నుండి ది.01.03.2024, శుక్రవారం వరకు
సమయం : ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు
మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు.
వేదిక : తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం, విజయవాడ.
సదా శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల సేవలో...
కర్నాటి రాంబాబు
చైర్మన్ ధర్మకర్తలమండలి
కె.ఎస్.రామరావు
కార్యనిర్వహణాధికారి మరియు డిప్యూటీ కలెక్టర్

## (మొదటి పేజీ తరువాయిలు)

### ముగిసిన టీడీపీ-జనసేన సమన్వయ కమిటీ సమావేశం

ప్రకటిస్తామని, ప్రస్తుతం తుదిమెరుగులు దిద్దుతున్నామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సీట్ల సర్దుబాటుపై అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఏ నియోజకవర్గంలో ఏ పార్టీ పోటీ చేయాలన్నది చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిర్ణయిస్తారని స్పష్టం చేశారు.

రాష్ట్ర శ్రేయస్సు దృష్ట్యా జగన్ మళ్లీ అధికారంలోకి రాకూడదన్న ఏకైక లక్ష్యంతోనే పొత్తు పెట్టుకున్నామని వివరించారు. పొత్తుల్లో కొన్ని త్యాగాలు తప్పవని చంద్రబాబు, పవన్ చెప్పిన విషయాన్ని అచ్చెన్నాయుడు ఈ సందర్భంగా గుర్తు చేశారు. టికెట్లు రాని వాళ్లు బాధపడవద్దని ఇద్దరు అధినేతలు ఇప్పటికే చెప్పారని వెల్లడించారు.

వాలంటీర్లను ఎన్నికల విధుల్లో నియమించరాదని, వాలంటీర్ల గురించి మాట్లాడిన మంత్రి ధర్మాన్నపై ఈసీకి ఫిర్యాదు చేశామని అచ్చెన్నాయుడు చెప్పారు.

**రెండు పార్టీలు కలిసి పనిచేసే సమయం వచ్చింది: నాదెండ్ల**

రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నేటి సమన్వయ కమిటీ సమావేశంలో చర్చించుకున్నామని జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఏపీకాల ఓట్లు చీలకూడదని పవన్ పలుమార్లు చెప్పారని వివరించారు. రెండు పార్టీలు కలిసి పనిచేసుకునే సమయం వచ్చిందని పేర్కొన్నారు. కలిసి పనిచేయాలని జనసేన, టీడీపీ కార్యకర్తలను కోరుతున్నామని నాదెండ్ల పిలుపునిచ్చారు. త్వరలోనే ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేస్తామని అన్నారు.

**తాడేపల్లిగూడెంలో ఈ నెల 28న ఉమ్మడి సభ**

తాడేపల్లిగూడెంలో ఈ నెల 28న టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ఉమ్మడి సభకు 500 మందిని ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించామని నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఈ సభకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ హాజరుకానున్నారని తెలిపారు. ఈ సభకు ఆరు లక్షల మంది వస్తారన్న అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉమ్మడి సభలో కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది.

### కేంద్రంలో మరోసారి, బీజేపీ సర్కార్

సిసి రోడ్డు, జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇచ్చిన మంచి నీటి కుళాయిలను సైతం కేంద్ర ప్రభుత్వమే ఇచ్చిందని అన్నారు. బీజేపీకి మద్దతుగా ప్రజలు నిలిచి ప్రధాన మంత్రి నరేంద్ర మోదిని స్థానిక బీజేపీ నాయకులను గిరిజన ప్రజలు మనస్ఫూర్తిగా ఆశీర్వాదించి, పాడేరు అసెంబ్లీ మరియు అరకు పార్లమెంట్ బీజేపీ అభ్యర్థులు గెలిపించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యులు నందోలి ఉమామహేష్,రాష్ట్ర గిరిజన మోర్చా సోషల్ మీడియా కో కన్వీనర్, రాష్ట్ర గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యులు కాకరి చిన్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణ, పాడేరు మండల గిరిజన మోర్చా అధ్యక్షులు కొండకింరంగి ఆనంతయ్య, పాడేరు మండల కన్వీనర్ పాంగి రామకృష్ణ, యువ నాయకులు కీల్లో గణేష్, జిల్లా నాయకులు వంటరి సత్యరాజు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

### వైఎస్ షర్మిల అరెస్టు-జగన్ సర్కార్ లో ఇదే తొలిసారి

రోడ్డు మీదుగా చల్లపల్లి జంక్షన్ వద్దకు చేరుకుంది. అక్కడ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులతో కలిసి షర్మిల మానవహారం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టు చేసిన వేలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలని, నాయకుల్ని విడుదల చేయాలంటూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

అనంతరం కాంగ్రెస్ నేతలతో కలిసి వైఎస్ షర్మిల సెక్రటేరియట్ కు బయలుదేరారు. దీంతో గుంటూరు జిల్లా సీతానగరం కొండవీటి వాగు ఎత్తిపోతల వద్ద షర్మిలను పోలీసులు అరెస్టు చేశారు. షర్మిలతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని దుగ్గిరాల పీఎస్ కు తరలించారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. భారీ ఎత్తున మోహరించిన పోలీసులు షర్మిలను అరెస్టు చేస్తుండగా కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించాయి.

### "కురుపాం" మార్కెట్ ను సమన్వయంతో అభివృద్ధి చేయండి

సభ్యులందరి ఏకాభిప్రాయంతో ఏకగ్రీవంగా చైర్మన్ గా తిత్తి కృష్ణను ఎన్నుకున్నారని తెలిపారు. సభ్యులుగా మైలపల్లి ఆదినారాయణ, ముత్తి క్రీన, నాగల రాజేశ్వరి, పోలవరపు లక్ష్మి, కండిపల్లి ఆదిలక్ష్మి, స్వర్ణ పూడి గాయత్రి దేవి, కస్సా కుమారి, గారా చిన తాతబ్బాయి నియమితులయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట పద్మావతి, కోదూరు అప్పలరత్నం, స్టేట్ డైరెక్టర్ సబిరా బేగం, నియోజకవర్గం వైసీపీ సీనియర్ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, లండా రమణ, కదిరి అప్పారావు, రమణమ్మ, మహిళా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరా ప్రియదర్శిని స్టేడియంను తళుకుగలిగిన ఆధునీకరించండి

చిల్డ్రెన్ ప్లే ఏరియా, జిమ్ పరికరాలు మొదలగు వాటిని ఏర్పాటు చేయుటకు ప్రణాళికలను సిద్ధం చేసి సమర్పించాలని పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణ రాజును కమీషనర్ ఆదేశించారు. స్టేడియం అంతటా పచ్చదనంతో లాన్డ్ స్కేపింగ్, మినియేచర్స్, కూర్చునే బల్లలను ఏర్పాటు చేయాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హర్టికల్చర్ సురేష్‌ను ఆదేశించారు. మార్చి నెల 15వ తేదీ నాటికి స్టేడియం నందు అన్ని పనులను పూర్తి చేసి అధునాతనంతో అందంగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశించారు.

అనంతరం దొండపర్తి నుండి నేషనల్ హైవే వరకు అక్కయ్యపాలెం రోడ్డు విస్తరణ, ఫుట్ పాత్ లు, కాలువలు, జంక్షన్ అభివృద్ధి, సెంటర్ మీడియన్, లైటింగ్, తదితర పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ వెణుగోపాల్ ను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్లు సంతోషి, మత్స్యరాజు, ఎ.సి.పి. యూన్సిలక్ష్మి, ఎ.ఎం.ఒ.హెచ్. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# యలమంచిలి మణిహారం రాజన్న వారధి : మంత్రి రాజా

### రోడ్ ఓవర్ బ్రిడ్జ్‌ను ప్రారంభించిన మంత్రి, ఎమ్మెల్యే
### ఈ నెల 29 నుంచి రాజన్న వారధిపై రాకపోకలు

**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** యలమంచిలి ప్రజల చిరకాలంగా ఇబ్బంది పడుతున్న సమస్యకు నేటితో పరిష్కారం లభించింది.యలమంచిలి రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ (రాజన్న వారధి)ని రాష్ట్ర రహదారుల, భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా, నియోజకవర్గ ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు గురువారం నాడు శిలాఫలకాన్ని ఆవిష్కరించి బ్రిడ్జ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులతో ఏర్పాటు చేసిన సభకు ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షత వహించగా మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ రాజన్న వారధిని ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందని, 2009 లో ప్రారంభించిన బ్రిడ్జ్‌ను ఇన్ని సంవత్సరాలుగా ఆగిపోయి, మరలా వాటికి సంబంధించిన దస్త్రాన్ని మరలా తిరిగి బయటకు తీసి పట్టుదలతో ఈ బ్రిడ్జ్‌ను పూర్తి చేయడం ఒక్క యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు వల్లనే సాధ్యమౌవుతుందని,మరెవ్వరికీ సాధ్యం కాదన్నారు. యలమంచిలి ప్రజలంతా రానున్న ఎన్నికల్లో మరలా కన్నబాబు రాజానే ఎమ్మెల్యేగా అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నానన్నారు. అనంతరం ఎమ్మెల్యే రమణమూర్తి రాజు మాట్లాడుతూ యలమంచిలి నుంచి అనకాపల్లి, విశాఖపట్నంకు వెళ్లేందుకు ఎప్పటికప్పుడు రైల్వే గేటు వేసేస్తుండడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని అప్పటి నియోజకవర్గ ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు (కన్నబాబు) 2009లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డికి తెలియజేయగా రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో అదే సంవత్సరం ఫిబ్రవరి 15న శంకుస్థాపన చేశారన్నారు. వైఎస్సార్ మరణాంతరం ఏర్పడిన ప్రభుత్వాలు బ్రిడ్జ్ గురించి పట్టించుకోలేదని,మరలా 2019లో తాను నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత అన్ని పేపర్లు బయటకు తీయించి కాంట్రాక్టరకు ఆర్డికంగా కాస్త మద్దతు ఇచ్చి యలమంచిలి ప్రజల రవాణాకు ఇబ్బంది లేకుండా చూడాలని కంకణం కట్టుకుని గత రెండు నెలలుగా నిద్రాహారాలు కూడా మాని ఈ బ్రిడ్జ్‌ను పూర్తి చేయించామన్నారు. 15,16తేదీల్లో స్లాబ్‌లు వేశారని అవి ఎక్కడ సామర్థ్యంగా ఉండేదుకు 20 రోజులు పడుతుందని, ఈ నెల 29 నుంచి బ్రిడ్జ్ పై నుండి రాకపోకలను అనుమతి స్తారన్నారు. కార్యక్రమం అనంతరం కాంట్రాక్టర్లు, రహదారుల నిర్మాణ శాఖాధికారులను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్ళా రమా కుమారి, మాజీ డిసిసిబి చైర్మన్ యు. సుకుమార్ వర్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డపు యర్రయ్యదొర, మున్సిపల్, నాలుగు మండలాల ప్రజాప్రతి నిధులు, అధికారులు, వైసీపీ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# అయోధ్య రామ మందిరం కోసం దశాబ్దాలుగా దీక్ష

అయోధ్యలో రామ మందిర నిర్మాణం అనేది కోట్లాది మంది హిందువుల కల. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో ఏళ్ల తరబడి అయోధ్య కేసు సాగగా రాముడికి గుడి కట్టాలని హిందువులు దశాబ్దాలుగా ఎదురు చూశారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం కోసం బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వానీ రథయాత్ర చేపట్టారు. ఎందరో త్యాగాల ఫలితంగా అయోధ్యలో రామ మందిర నిర్మాణం పూర్తి చేసుకుని జనవరి 22న రామ్ లల్లా ప్రతిష్ఠ పూర్తి చేసుకుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా శ్రీరాముడి ఆలయం ప్రారంభమైంది. అయితే మందిర నిర్మాణమనే స్వప్నం సాకారం కావడం కోసం దేశంలోని చాలా మంది దీక్షలు చేశారు.

మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు చెందిన ఊర్మిళ చతుర్వేది అనే మహిళ రామ మందిర నిర్మాణం కోసం 1992 నుంచి ఉపవాస దీక్షలో ఉంది. అప్పటి నుంచి ఆమె పండ్లు, పాలను మాత్రమే ఆహారంగా స్వీకరిస్తోంది. రామ మందిర నిర్మాణం ప్రారంభమయ్యే వరకూ ఉపవాస దీక్ష చేస్తానని ప్రకటించిన ఆమె 28 ఏళ్లపాటు మాట మీద నిలబడ్డారు.

ఈక్రమంలోనే కర్నాటకలోని హుబ్లికి చెందిన గణేష్ జర్తర్‌ఘర్ అనే వ్యక్తి కూడా ఇలాంటి దీక్ష చేపట్టారు. గణేష్ జర్తర్‌ఘర్ చిన్నప్పటి నుంచే శ్రీరాముడంటే ఎంతో భక్తి. సీతా రాముల పట్ల అమితమైన భక్తిభావం ఉండేది. అయోధ్యలో రామ మందిర నిర్మాణం పూర్తి కావాలని ఆయన కోరుకున్నారు. తన కోరికలు నెరవేరే వరకు జుట్టు కత్తిరించుకోనని శపథం చేశారు. విశ్వ హిందూ పరిషత్ పిలుపు మేరకు 1990లో అయోధ్యలో జరిగిన కరసేవ కార్యక్రమంలో సైతం పాల్గొన్నారు. ఎట్టకేలకు రామ మందిర నిర్మాణం పూర్తి రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠ జరగడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

అయోధ్యలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం అయింది. ఉత్తరప్రదేశ్‌లోని రామ జన్మభూమి అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామాలయంలో బాల రాముడి కొలువుదీరారు. దీంతో తాన సంకల్ప నెరవేరడంతో దీక్ష విరమించారు నారాయణ్. దశాబ్దాలుగా పెంచుకున్న జుట్టు, గడ్డం తొలగించి అయోధ్య రాముడి మొక్కు చెల్లించుకున్నారు. హుబ్లీలో వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ వెంట్రుకలను సమర్పించుకున్నారు. నారాయణ్ జర్తర్‌ఘర్ హుబ్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఫిన్యాట్ మేయర్ నారాయణ్ జర్తర్‌ఘర్ సోదరుడే గణేష్ జర్తర్‌ఘర్ బాధ్యతలు కూడా నిర్వహించారు.

సంకల్ప అనేది దానిని సాధించే దిశ వరకు కొనసాగుతుంది. దానికి ఎటువంటి నిర్ణీత సమయం లేదు. కోరిన కోరికను పూర్తి చేయడానికి చాలా సంవత్సరాలు పడుతుంది. దానికి ఓపిక అవసరం. ఎట్టకేలకు తన కోరిక నెరవేరడం పట్ల గణేష్ సంతోషం వ్యక్తం చేశారు. రాముడి ప్రాణ ప్రతిష్ఠ తన జీవితాన్ని ధన్యం అనందం, విజయంతో నింపిందన్నారు. రాముడి దీక్షను విజయవంతంగా పూర్తి చేసిన నారాయణ్ జర్తర్‌ఘర్ పలువురు ప్రముఖులు అభినందించారు.

**పంచాంగం**

శుక్రవారం 23-02-2024
శోభకృత్ నామ సంవత్సరము
ఉత్తరాయణం ,శిశిర ఋతువు
మాఘ మాసం

| | |
|---|---|
| తిథి | : ప. చతుర్దశి ప. 03.09 |
| నక్షత్రం | : ఆశ్లేష రా. 07.17 |
| వర్జ్యం | : ఉ. 07.06 ల 08.50 |

# చపాతి సూరిబాబు ఇక లేరు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి పట్టణ పరిసర ప్రాంతాల్లో అందరికీ సుపరిచితుడైన చపాతీ సూరిబాబు గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. బాబాయ్ హోటల్ ఎంత ప్రసిద్ధో అదే విధంగా అనకాపల్లి పట్టణంలో సూరిబాబు చపాతి అంటే అంత ప్రసిద్ధి. సుమారు 40 సంవత్సరాలుగా తన తండ్రి నుండి తీసుకున్న వ్యాపారాన్ని వారసత్వంగా తీసుకొని స్థానిక చింతా వారి వీధిలో చపాతి వ్యాపారం చేస్తూ వస్తున్నారు. 40 ఏళ్ల క్రిందట ఆయన తండ్రి ఈ వ్యాపారం ప్రారంభించారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు చపాతి బండి వద్ద జనంతో సందడి సందడిగా ఉండేది. పెద్ద పెద్ద వర్తకులు, ఉద్యోగులు సైతం చపాతి బండి వద్ద క్యూ కట్టాల్సిందే. చపాతితో పాటు ఆయన ఆలు కర్రీ, పెరుగు చట్ని, గోంగూర పచ్చడి కోసం చపాతి ప్రియులు లొట్టలేసుకుని ఎదురు చూసేవారు. ఇటీవల కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురై విశాఖలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయన తుది శ్వాస విడిచినట్టు స్థానికులు తెలిపారు. ఇప్పటికే పలువురు ఆయనకు సంతాప చిహ్నాం పలు ప్రాంతాల్లో ఆయన ఫోటో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు

### ప్రభుత్వంతో చర్చలకి సచివాలయ ఉద్యోగ సంఘానికి దక్కని చోటు

**అమరావతి:** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతో నిర్వహిస్తున్న ప్రత్యేక చర్చలకు గ్రామ, వార్డు సచివాలయ శాఖ సంఘానికి చోటు దక్కలేదు. ప్రభుత్వం జిఏడి నుంచి ఉద్యోగ సంఘాలకు చర్చలకు రావాలని సుమారు 13 సంఘాలకు పిలుపునివ్వగా, సీఎం వైఎస్. జగన్మోహన రెడ్డి మానవవనరుల శాఖ అయిన గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం పేరు అందులో లేదు. ఉద్యోగ సంఘాలతో శుక్రవారం ఉదయం 10.30గంటలకు రాష్ట్ర సచివాలయంలో చర్చలు జరగనున్నాయి. ఏపీలోని 75 ప్రభుత్వశాఖల్లో గ్రామ, వార్డు సచివాలయశాఖ ప్రత్యేకంగా వుంటుందని, సీఎం వైఎస్.జగన్మోహనరెడ్డి ముందుచూపుతో ఏర్పాటైన ఈ శాఖకు అన్ని విధాలా గుర్తింపు వుంటుందని అంతా భావించారు. అది నుంచి ఈశాఖ ఉద్యోగుల సంఘానికి ప్రాతినిధ్యం పూర్తిస్థాయిలో లేకపోవడం విశేషం. పైగా అన్ని ప్రభుత్వ శాఖ ఉద్యోగులతోపాటు సమానంగా ప్రయోజనాలు రాకపోయినా, ప్రశ్నించడానికి ముందుకి వెళ్లలేని పలు యూనియన్ల నాయకులు మాత్రం ప్రభుత్వ నిర్ణయాలను సమర్థిస్తూనే ఉంటారు. కాగా ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరుగుతున్న వేళ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘానికి వర్తమానం లేకపోయిన విషయం హాట్ టాపిక్ అవుతోంది.

విశాఖ సమాచారమ్
ప్రతులకు, ప్రకటనలకు
సెల్: 9393949345,
8247526179

# అధికారుల అండదండలతో ఇసుక అక్రమ తవ్వకాలు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలు నిజమేనని కేంద్ర ప్రభుత్వం పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ హైకోర్టుకు నివేదిక ఇచ్చిందని, దీనికి జిల్లా లో అధికారుల సహకారంతో భారీ యంత్రాలతో ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తున్నట్లుగా కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరిశీలించారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు వైసీపీ ప్రభుత్వం పై విరుచుకుపడ్డారు.

ఇసుక అక్రమ తవ్వకాల ఫోటోలు, నకిలీ బిల్లు పుస్తకాలు, తదితర ఆధారాలను కమిటీ సేకరించిందని దీనిపై ముఖ్యమంత్రి జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని నాగ జగదీష్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతలకు కనుసన్నలో 500 కి పైగా రీచులో అక్రమంగా ఈసీలు లేకుండా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని అన్నారు. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నివేదికలో కీలక అంశాలు - ఇసుక తవ్వకాలలో పెద్ద ఎత్తున ఉల్లంఘనలు జరుగుచున్నాయని, రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రభావ మదింపు సంస్థ గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు ఇసుక తవ్వకాలకు కొత్తగా పర్యావరణ అనుమతులు జారీ చేయలేదని, అయినా సరే భారీ యంత్రాలతో 24 గంటలు తవ్వేస్తూ ఒక్కొక్క రీచ్ నుంచి 1000 నుండి 2000 టన్నుల వరకు ఇసుక తరలిస్తున్నారని, చేతిరాతతో వే బిల్లులు ఇస్తున్నారని, కంప్యూటర్ బిల్లులు ఇవ్వడం లేదని, సీసీ కెమెరాలు లేవు, వివరాలను అడిగితే గనులు శాఖ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని సమాధానాలు చెప్తున్నారని నాగ జగదీష్ వ్యాఖ్యానించారు. అనేక జిల్లాలలో జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదు చేసినప్పటికీ అక్రమ మైనింగ్ జరగడం లేదని నివేదిక ఇవ్వడం సిగ్గుచేటని, ఇన్క్ రీచ్ లో జరిగిన అక్రమాలపై కేంద్ర ప్రభుత్వ సంస్థ మినిస్టర్ ఆఫ్ ఎన్విరాన్మెంట్ క్లైమేట్ చేంజ్ వారికి కనిపించిన అక్రమ మైనింగ్ గౌరవ జిల్లా కలెక్టర్లకు కనిపించడం లేదా అని నాగ జగదీష్ ప్రశ్నించారు. జగన్ రెడ్డి ఇసుక దోపిడీకి 130 మంది భవన నిర్మాణ కార్మికులు బలయ్యారని, వైసీపీ నేతల ఇసుక మాఫియా వల్లే అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి 408 మంది ప్రాణాలు కోల్పోయారని, నేటికీ డ్యామ్ నిర్మాణం పూర్తి చేయలేదని, చనిపోయిన కుటుంబాలకు న్యాయం జరగలేదని నాగ జగదీష్ ఆవేదన వ్యక్తపరిచారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదు చేసినందుకు వైసీపీ మాఫియా దళిత యువకుడు వరప్రసాద్ కి శిరోముండన చేయడం వాస్తవం కాదా? దీనిపై హైకోర్టులో కేసులు నడుస్తున్నాయని, స్వయంగా రాష్ట్రపతి వరప్రసాద్ కి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పినప్పటికీ పట్టించుకోలేదని, 13 జిల్లాలలో ఎటువంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున అక్రమ ఇసుక దందా నడుస్తుందని ఇందుకు సహకరించిన అధికారులు కూడా శిక్షలు పడడం ఖాయమని, ఇసుకలో దొచుకున్న డబ్బుతో రానున్న ఎన్నికల్లో గెలవాలని జగన్ రెడ్డి కుట్రలు, తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ నేతల దోచుకున్నదంతా కక్కిస్తామని నాగ జగదీశ్ హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు బీసీ నాయకులు ఏపీఎం సత్యనారాయణ గుడాల సత్యనారాయణ తెలుగు మహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు శంకర పద్మలత తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్

శుక్రవారం 23-02-2024

## వయసు మానసిక ఎదుగుదలకు దర్పణం కాదు

బాల్యదశ తరువాత మనలో శారీరకంగా వచ్చే మార్పు, ఎదుగుదలే పరిణతి. ఇది భౌతికమైనదే కాదు, మానసికమైనదీ కూడ. మన ఆలోచనలలో, ఆలోచనా రీతిలో వచ్చిన, వస్తున్న తేడాను చూపుతుంది. అంటే మన మనోవికాసాన్ని, దాని స్థాయిని సూచిస్తుంది. మనం వయసు రీత్యా ఎదిగే క్రమంలో మన భాషలో, అభివ్యక్తిలో, ఎదుటివారిని అర్థం చేసుకునే తీరులో, మన స్పందనలో చెరసి మన ప్రవర్తనలో వచ్చే క్రమానుగతమైన మార్పే పరిణతి. కొంతమందిలో వారి శరీరక వయసు కన్నా పరిణతి వయసు ఎక్కువ. మరికొందరిలో దీనికి భిన్నమూ కావచ్చు. వయసులో పెద్దవారైనా తగిన పరిణతి లేకపోవచ్చు. అలాగే వయసులో చాలా చిన్నవారైనా కొంత మందిలో ఎంతో మానసిక పరిణతి కనిపిస్తుంటుంది. కాబట్టి మన వయసు మన మానసిక ఎదుగుదలకు దర్పణం కావచ్చు. కాకపోవచ్చు. అందువల్లనే పరిణతికి వయసు లేదని, వయసు రీత్యా నిర్ధారించలేమని విజ్ఞులు చెపుతారు.

పరిణతికి భాష్యార్థాలు చాలా ఉన్నా పరిపక్వత అన్న అర్థంలో ఎక్కువగా వాడతారు. ప్రవర్తన గురించి చెప్పటానికి తరచూ వాడే మాట. పరిణతి అన్న వాలుగు అక్షరాలలో ఎంతో విశేషమైన, లోతైన, విస్తృతార్థముంది. పరిణతంటే సంకేప్తంగా చెప్పాలంటే భావోద్వేగాల మీద గట్టి పట్టు, నియంత్రణే పరిణతి. విచక్షణ, వివేచన, సంయమనం, సహనం, క్రమాగమణం, ఉచిత సంభాషణ తీరు, దూరదృష్టి, విభేదాలు మరచి అందరిని కలుపుకుని ముందుకు సాగే వైఖరి. ఇక్కడ ఉదాహరించినవి కొన్నే అయినా ఈ పరిణతి ఇంకా ఎన్నో లక్షణాలను దానిలో పొదవుకుంది.

మన పుట్టుకకు లక్ష్యం జీవితాన్ని మెరుగుపరుచుకోవటం. మనలోని దుర్గుణాలను తొలగించుకుంటూ, మంచిని పెంచుకుంటూ ఇతరులను కలుపుకుని మనలోని మానవీయ శక్తులను బలపరచుకుంటూ ముందుకుసాగాలి. అదే జీవిత సార్థకత. ఉత్తమమైన, ఉన్నతమైన పథంలో పయనించ గలగాలి. అప్పుడే కదా మానవులు బుద్ధిజీవులన్న మాటకు మరింత ఊతాన్నిచ్చినట్టు! ఇది మనసులో నిలుపుకుని మానవుడే మహనీయుడు అన్న మాటను సుసాధ్యం చేయాలనుకునే వారికి పరిణతి ఎందుకు సాధ్యం కాదు? అన్న ఆలోచన వస్తుంది. దీన్ని సాధించి తీరాలన్న పట్టుదల వస్తుంది. అటువంటి వారికి ఇంత గొప్ప పరిణతి సాధించటం అసాధ్యం కాదు. అంటే దీనర్థం పరిణతికున్న అర్థ పార్శ్వాలన్నిటిపై వారికి ఓ పట్టు వచ్చి వారి వ్యక్తిత్వంలో ఒక భాగమైపోతుంది.

మన జీవనక్రమంలో అనేకమందితో కలసి ప్రయాణం చేయవలసి ఉంటుంది. ఈ ప్రయాణం కొందరితో కొంతకాలం, మరికొందరితో జీవితాంతం సాగుతుంది. వీరందరితోనూ సంబంధ బాంధవ్యాలు నిలుపుకోవలసిన ఆవశ్యకత ఉంది. దీనికి గొప్ప మానసిక పరిణతి కావాలి. ఇంతటి ఉన్నత పరిపక్వత సాధించే గలిగే వారు వేళ్ళమీద లెక్కించగల సంఖ్యలోనే ఉంటారు. వాళ్లు వయసులో పెద్దవారైనా చిన్నవారైనా గొప్పవారే, ఆదర్శనీయులే, నమస్కరించ తగినవారే.

ఒక విషయాన్ని అర్థం చేసుకునే పద్ధతిలో మన దృష్టి ముఖ్యపాత్ర వహిస్తుంది. ఇక్కడ దృష్టి అంటే మన వైఖరి. సమగ్రమైన అవగాహన రావాలంటే దానికి చుట్టుకొని ఉన్న అన్ని కోణాలను పరిగణలోకి తీసుకోవాలి. అప్పుడే దానిమీద సాధికారంగా మాట్లాడగలం. ఈ దృష్టి, విశ్లేషణా శక్తి, అవగాహనా తీరునే పరిణతి అంటాం.

స్థాయిలో పరిణతి సాధ్యమా? అన్న ప్రశ్న చాలామందిలో ఉదయిస్తుంది. గట్టి ప్రయత్నం చేయగలిగితే కనక ఇది సాధ్యమే ఇది మన దృఢ నిశ్చయం మీద ఆధారపడి ఉంటుంది. అందరూ ప్రయత్నించినా ఇది ఏ కొందరికో మాత్రమే పట్టుబడే శక్తి. ఈ పరిణతికి ఆవశ్యమైన అనేక లక్షణాలలో కొందరికి కొన్ని బాగా అలవడవచ్చు. అందుకే దీనికి స్థాయీభేదం ఉంటుంది.

ప్రతి ఒక్కరి వయసు పెరుగుతూ ఉంటుంది. ఇది భౌతికమైనది. దీనికి అదే నిస్పత్తిలో మానసిక ఎదుగుదల ఉందా? మనలో ఎంతమంది వయసుకు తగిన విధంగా సమయోచితంగా ప్రవర్తిస్తున్నాం!? ఈ రెండిటి మధ్య ఒక సమతౌల్యత పరిణతే కదా!

మనం కొన్ని విషయాల్లో కొందరితో విభేదిస్తాం. అంతమాత్రాన బద్ధశత్రువులం కానవసరంలేదు. ఓ భావపరమైన, సిద్ధాంత పరమైన విషయాల వరకు మాత్రమే దానిని పరిమితి చేయాలి. అలాగే చంపదగ్గ శత్రువు మన చేత చిక్కినా దాడిని చంపకుండా తగిన మేలు చేసి విడిచిపెట్టాలని వేమన చెప్పిన దానిలోనూ, మనకు అపకారం చేసిన వారికి కూడ వారి తప్పులను ఎంచకుండా ఉపకారం చేయాలని బద్దెన చెప్పిన దానిలో గోచరించేది పరిణతే. పరిణతి ఓ ధైర్యం. నిశ్చలత, స్థిత ప్రజ్ఞత.

చక్కని శ్రుతి లయలతో, ఆరోహణ అవరోహణలతో, భావయుక్తంగా అటు శాస్త్రీయత ఇటు మాధుర్యం రెండిటి సమాన నిష్పత్తిలో అద్భుతంగా సంగీతకళేరి చేస్తున్నాడో యువ సంగీత కళాకారుడు. ఆ రాగ జగత్తులో, ఆ భావనాజగత్తులో విహరిస్తూ తాదాత్మ్యతతో పాడుతున్న అతడి గానం పండిత, పామర రంజితంగా సాగింది. తన సంగీత ప్రవాహంలో ఊయలలూగించిన ఆ కళాకారుడు అంధుడు. కచేరి అనంతరం అతణ్ణి ఆ ఊళ్ళో అతనికి చిన్నప్పుడు సరళి స్వరాలు నేర్పుతూ అసలు ఈ గుడ్డివాడికి ఆ విద్య అలవడనే అలవడదని తరిమేసిన అతని గురువు దగ్గరకు తీసుకు వెళ్లారు నిర్వాహకులు. ఆ శిష్యుడు ఆయనకు పాదాభివందనం చేసి 'ఇదంతా మీరు పెట్టిన భిక్షే' అని వినయంగా ఆయన పక్కన నిలబడ్డాడు. అంతే! ఆ గురువుకు తను చేసిన చర్య మనసులో కదిలి, సిగ్గుపడ్డాడు. అటు సంగీతంలోనే కాకుండా ప్రవర్తనలోనూ ఎంతో పరిణతి సాధించిన శిష్యుణ్ణి చూస్తూ ఆనందాశ్రువులు రాలుస్తూ మనసారా అతణ్ణి ఆశీర్వదించాడు. శారీరక వయసు కన్నా పరిణతి వయస్సు ఎక్కువని చెప్పటానికి ఇది చక్కని ఉదాహరణ.

పరిణతి పొందటానికి అత్యంత అవసరమైనది అవేశాన్ని విడటం. దానికి ఎంత దూరమైతే మానసిక పరిపక్వతకు అంత దగ్గరవుతాం. ఆవేశంలో ఆలోచనా శక్తిని కోల్పోతాం. వికేకం నశిస్తుంది. ఆ స్థితిలో మన మనసు తుఫానులో చిక్కుకున్న కల్లోలిత సంద్రమే. ఈ ఆవేశహంకారాలే విశ్వామిత్రుణ్ణి రాజర్షి స్థాయి నుండి మహర్షి బ్రహ్మర్షి స్థాయికి చేర్చటానికి అవేద్యమైన అవరోధమైంది. ఆయన జీవితంలో సింహభాగాన్ని ధార పోసేటట్టు చేసింది.

## సమతా కళాశాలలో మరో ఆణిముత్యం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగరంలో ఉన్న సమతా కళాశాలలో మరో క్రీడా ఆణిముత్యం రొంగలి దేముడుకు ఎంబీఏ ద్వితీయ సంవత్సరం అయిన వెంటనే క్రీడల ద్వారా కరూర్ వైశ్య బ్యాంకులో ఆఫీసర్ సీఎస్సీ ఉద్యోగం లభించింది. ఈ సందర్భంగా కళాశాల డీన్ విజయరవీంద్ర, సెక్రటరి రవీంద్ర, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు, హెచ్ఓడీలు మాధవిలత, రమేష్, కోటి, దేవిక, పద్మజ, రహమాన్, రమణ, ఎన్ఎస్ఎస్ పీఓ డా॥ రాజేష్‌కుమార్, వ్యాయామ విభాగాధిపతి జి.రామకృష్ణ, రొంగలి దేముడిని అభినందించారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న విజయ్ కుమార్

**అమ్మతాపురం, (విశాఖ సమాచారమ్):** జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి యలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ సుందరపు విజయ్ కుమార్ గురువారం అచ్యుతాపురం మండలం కొత్త మానయ్యపేట గ్రామంలో శ్రీశ్రీశ్రీ మరిడిమాంబ అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మునగపాకలో శ్రీ కృష్ణుడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని శ్రీకృష్ణుడి దర్శనం చేసుకున్నారు. మునగపాక గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు సూరిశెట్టి అప్పలనాయుడు కుమార్తె నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాలలో పార్టీ నాయకులు జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

## డైట్ కళాశాలలో ట్విన్స్ డే

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక డైట్ కళాశాలలో గురువారం ట్విన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ మదర్స్ డే, ఫాదర్స్ డే లాగా ట్విన్స్ (కవల పిల్లలకు) కు ఒకరోజు ఉంది. అదే అంతర్జాతీయ కవల పిల్లల దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 22వ తేదీన జరుపుకుంటారు. వీళ్లు చూడటానికి దాదాపుగా ఒకే రూపు రేఖలు కలిగి ఉంటారు. ఒకొక్కసారి వాళ్ళ ప్రెండ్స్‌ని అటపటిస్తూ ఉంటారు. బట్టలు కూడా ఒకే విధంగా ధరిస్తారు. ఉపాధ్యాయులు కూడా కన్ఫ్యూజ్ అవతూంటారు అని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠ రావు మాట్లాడుతూ ఒకే రూపు రేఖలు కలిగి ఉన్న విద్యార్థులకు ట్విన్స్ (కవల) దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడాపోటీలలో మెరిసిన విద్యార్థిని

### గ్రామీణ క్రీడాకారులకు కావ్య ఆదర్శం : ప్రిన్సిపాల్

**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** జాతీయ స్థాయి క్రీడలలో తాము కూడా సత్తా చాటుతామని నిరూపించిన గ్రామీణ ప్రాంతానికి చెందిన క్రీడాకారిణి సిరసపల్లి కావ్యను గురువారం యలమంచిలి శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ నుండి 21 వరకు గుంటూరు జిల్లాలోని కే.ఎల్ యూనివర్సిటీలో జరిగిన జాతీయస్థాయి క్రీడల పోటీలలో స్థానిక శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం బీఏ విద్యార్థిని సిరసపల్లి కావ్య అద్భుత ప్రతిభను ప్రదర్శించింది. బ్యాడ్మింటన్ విభాగంలో కావ్య మొదట స్థానంలో నిలవడమే గాక ట్రోఫీని 15 వేల రూపాయల నగదు బహుమతిని గెలుచుకుంది. జాతీయ స్థాయిలో కావ్య చూపించిన ప్రతిభ కళాశాల విద్యార్థులకే కాకుండా యలమంచిలి పరిసర ప్రాంత గ్రామీణ విద్యార్థులకు కూడా ఎంతో స్ఫూర్తి కలిగిస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. అనంతరం కావ్యకు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పాలిరెడ్డి, కావ్యను కళాశాల అధ్యాపకులతో పాటు పలువురు అభినందించారు.

## ఏఆర్వోలకు డైరీలు పంపిణీ

**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** తాశీల్దార్ కార్యాలయంలో మండల ఏఆర్వోల సంఘం అధ్యక్షులు మారేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం నాడు జిల్లా ఏఆర్వోల సంఘ అధ్యక్షులు టి.రామకాసు చేతుల మీదగా 18మంది ఏఆర్వోలకు డైరీలు అందజేశారు.ఈ సందర్భంగా టి.రామకాసు మాట్లాడుతూ ఏఆర్వోలంతా ఐక్యమత్యంగా ఉండాలని ఎటువంటి సమస్యనైనా కలిసి పరిష్కరించు కోవాలని, కలిసి కట్టుగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ దివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, ఏఆర్వోలు పాల్గొన్నారు.

## బీజేపీ ప్రజా పోరు యాత్ర ప్రారంభించిన అల్లూరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాంగి రాజారావు

**పాడేరు, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రంలో అధికార పార్టీ వైసీపీ నిరంకుశ విధానాలు పై బీజేపీ ప్రజాపోరు యాత్రను ప్రజలు విజయంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు ప్రజలకు పిలుపు నిచ్చారు. పాడేరు మోదకొండమ్మ అలయం వద్ద బీజేపీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు అల్లూరి జిల్లా పాడేరులో ప్రజా పోరు యాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకాపా నిరంకుశ పాలన పై కోర్టు ధిక్కార జీవోలు, ఇసుక, మద్యం, భూ దందాలపై దళిత గిరిజన నేతల పై ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసులు ,రాష్ట్రంలో రాజకీయ నాయకులు పై తప్పుడు కేసులు నమోదు, అంగన్వాడీ, ఉపాధ్యాయులు, పాత్రికేయులపై గొంతు ఎత్తితే అక్రమ కేసులు నిర్బంధం చేస్తున్న ప్రభుత్వం పై బీజేపీ పోరు యాత్రలో వివారిస్తామని తెలిపారు, అదేవిధంగా వైసీపీ అధినేత అక్రమ ఆస్తుల కేసులనుండి వేల సంఖ్యలో వాయిదాలుకు వెళ్లకుండా కోర్టు నుండి తప్పించుకోవడానికి ప్రయత్నం చెయ్యడం సిగ్గూ చేటని అన్నారు, రాబోయే ఎన్నికల్లో దొంగవోట్లు నమోదు చేసి ఎన్నికల్లో గెలవడానికి వ్యూహం, రాష్ట్రంలో రాజధాని లేదు 3 రాజధానులు పై 5 ఏళ్ళు కాలయాపన చేసి మరోసారి హైదరాబాద్ ఉమ్మడి రాజధాని ఉమ్మడి రాజధాని కావాలని తప్పించుకోవడానికి వైసీపీ నేతలు మాయమాటలు చెబుతున్నారు. కేంద్రం నేరుగా ఇస్తున్న గ్రామ పంచాయతీ నిధులు మళ్లింపు, ఐస్సు, విద్యుత్ చార్జీల పెంపు, చెత్త పై పన్ను,రాష్ట్రంలో రోడ్ల దుస్థితి 5ఏళ్ళు రాష్ట్రంలో ఒక్క రహదారి కానీ గ్రామాల్లో సీసీ రోడ్లు వేయని ఈ ప్రభుత్వ ధోరణి పరిస్థితి రాష్ట్ర ప్రజలుచూస్తున్నారు, ఆంధ్రప్రదేశ్ ప్రజలుకు సంపూర్ణ మద్య నిషేధం చేస్తా అని ఎన్నికల్లో ఒక్క చాన్స్ అని 2019 ఎన్నికల్లో అధికారంలోవచ్చిన వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి ని రాబోయే ఎన్నికల్లో గద్దె దించడమే బీజేపీ లక్ష్యంగా చేసుకొని బీజేపీ ప్రజా పోరులో వైసీపీ ప్రభుత్వాన్నీ ప్రజా బోనులో నిలబెట్టి నిలదీస్తామని వారు తెలిపారు,

కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ, దేశవ్యాప్తంగా ఉచితంగా గరీబ్ కళ్యాణ్ యోజన, ప్రతీ ఎస్టీ ఎస్సి వారికి 200 యూనిట్‌ల విద్యుత్ సరఫరా, ఉపాధి హామీ పథకం, ప్రతీ ఒక్కరుకు బ్యాంకు ఖాతాలు, డిజిటల్ పేమెంట్‌లు, గ్రామాల్లో ప్రజలుకు జలజీవన్ మిషన్ ద్వారా మంచినీటి సరఫరా, ప్రతీ వారికి సుకన్య సమృద్ధి యోజన ఆడ బిడ్డలుకు ఇన్సూరెన్స్, పెద్దలుకు అటల్ పెన్షన్ యోజన, ముద్రా లోన్సు, పీఎం ఈ జి పి ద్వారా స్వయం ఉపాధి అవకాశాలకు లక్ష నుండి 50 లక్షల వరకు బ్యాంకు గ్యారంటీ లేకుండా మంజూరు చేస్తున్నారు నరేంద్రమోదీ ప్రభుత్వం, గిరిజన ప్రాంతాల్లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన మారుమూల ప్రాంతాల్లో రోడ్లు నిర్మాణం, గిరిజన ప్రాంతాల్లో పి వి టి జ లకు ప్రత్యేక నిధులు విడుదల చేశారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అని తెలిపారు, దేశంలో గిరిజన ప్రాంతాల్లో ఏకలవ్య పాఠశాలలు అన్ని వసతులుతో నిర్మాణం, జాతీయ రహదారులు నిర్మాణం, ప్రధానమంత్రి అవాస్ యోజన ద్వారా ప్రతీ గిరిజన ప్రాంతాల్లో 2,లక్షల 20 వేల రూపాయలు వెచ్చించి ఇస్తుంది బీజేపీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అని తెలిపారు. దేశవ్యాప్తంగా నేడు మచ్చ లేని ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం అని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సల్లా రామకృష్ణ, డా॥ రాఘవేంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు వేమనబాబు, బీజేపీ గిరిజన రాష్ట్ర మేధావులు కన్వీనర్ కురుసా పార్వతమ్మ, బి.సాయి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానము

CITIZENS for DEMOCRACY

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో




రాష్ట్రస్థాయి కళాజాత

ప్రారంభోత్సవ కార్యక్రమం

బి. 25-02-2024 ఆదివారం, ఉ॥ 10 : 00 గం॥లకు

కె.ఆర్.సి. ఆడిటోరియం, గీతం యూనివర్శిటి, ఋషికొండ, విశాఖపట్నం

వక్తలు

శ్రీయుతులు యల్.వి. సుబ్రహ్మణ్యం

ఉపాధ్యక్షులు, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ. పూర్వ ఛీఫ్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

శ్రీయుతులు డా॥ నిమ్మగడ్డ రమేష్ కుమార్

పూర్వ రాష్ట్ర ఎన్నికల అధికారి, ప్రధానకార్యదర్శి, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ

శ్రీమతి ప్రొ॥ కె.నిరుపరాణి

పూర్వ వైస్ ఛాన్సలర్, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం

ప్రొ॥ పి.హరిప్రకాష్

పూర్వ డైరెక్టర్, దూర విద్యా కేంద్రం, ఆంధ్ర యూనివర్శిటి

డా॥ తరీఫ్ సోహాయిల్, రాజనీతిశాస్త్ర ఆచార్యులు, గీతం యూనివర్శిటి

శ్రీ వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, సంయుక్త కార్యదర్శి, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ

12 మందితో కూడిన రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర స్థాయి కళాకారులతో ఓటు విలువను తెలుపుతూ గేయాలు, నృత్య నాటికలు, జాన పదాలు, గజల్స్ ఆలపిస్తారు.

అందరూ ఆహ్వానితులే

వివరాలకు
9949930670

## మధుమేహం నియంత్రణకు అద్భుత ఔషధం

ఆయుర్వేదంలో, హిందూ ఆధ్యాత్మికతలో తులసి మొక్కకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. తులసి మొక్క ఆకులు, గింజలతో అద్భుత ప్రయోజనాలున్నాయి. తులసి ఆకుల నీళ్లతో మధుమేహాన్ని సైతం నియంత్రించ వచ్చని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు.

ప్రస్తుత బిజి ప్రపంచంలో మధుమేహం అనేది పెనుసవాలు విసురుతున్న సమస్యగా మారుతోంది. మధుమేహం నియంత్రణలో ఉంటేనే ఆరోగ్యపరంగా బాగుంటుంది. ఎందుకంటే బ్లడ్ షుగర్ అనేది చాలా ప్రమాదకరం. బ్లడ్ షుగర్ స్థాయి పెరిగితే డయాబెటిక్ పేషెంట్‌గా మారిపోతారు. అయితే ఆయుర్వేదంలో మధుమేహానికి మంచి ప్రత్యామ్నాయం ఉందంటున్నారు వైద్యులు. సరైన ఆహారపు అలవాట్లు, మెరుగైన జీవనశైలితో చాలావరకూ రోగాల్ని దూరం చేసుకోవచ్చు. అయితే చిన్న చిన్న విషయాల్ని దృష్టిలో పెట్టుకుంటే బ్లడ్ షుగర్ స్థాయిని నియంత్రించవచ్చు. అయితే తులసి నీళ్లతో బ్లడ్ షుగర్ తగ్గించుకోవచ్చని చాలా తక్కువ మందికి తెలుసు. తులసి ఆకుల నీళ్లను మధుమేహం తగ్గించేందుకు ఎలా వాడాలనేది ఇప్పుడు తెలుసుకుందాం.

మధుమేహం నియంత్రణలో ఉండాలంటే ముఖ్యంగా కావల్సింది బ్లడ్ షుగర్ లెవెల్స్ తగ్గించుకోవాలి. ఓ గ్లాసు నీళ్లలో తులసి ఆకులు కొన్ని వేసి ఉడికించాలి. ఆ తరువాత ఆ నీటిని వడపోసి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం తాగాలి. ఇలా చేస్తే బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణలో ఉంటాయంటున్నారు ఆయుర్వేద వైద్య నిపుణులు.

ఆయుర్వేద వైద్యశాస్త్రంలో తులసి నీళ్లతో చాలా ప్రయోజనాలున్నాయి. తులసి నీళ్లు జలుబు, దగ్గు తగ్గించేందుకు అద్భుతమైన ఔషధంగా ఉపయోపడతాయి. శరీరంలో రోగ నిరోధక శక్తి పెంచేందుకు ఉపయోగపడుతుంది. ఆధునిక పోటీ ప్రపంచంలో ఎదురయ్యే ఒత్తిడిని జయించేందుకు తులసి ఆకులు గానీ, తులసి నీళ్లు గానీ మీ డైట్‌లో భాగంగా చేసుకుంటే మంచి ఫలితాలుంటాయి. తులసి ఆకులతో టీ కూడా చేసుకుని తాగినా మంచి ఫలితాలుంటాయి.

# గ్యాస్ట్రిక్, బైపాస్ సర్జరీ తర్వాత ఆహార నియమాలు

గ్యాస్ట్రిక్, బైపాస్ సర్జరీ తర్వాత సహజంగా ఎటువంటి డైట్ పాటించాలని అనుకుంటే ఎలాంటి ఆలస్యం చేయకుండా దీన్ని పూర్తిగా చూసేయండి. డీహైడ్రేషన్ కు గురి అవకుండా ఉండాలంటే ప్రతి రోజు రెండు లీటర్ల వరకూ ఫ్లూయిడ్స్ తీసుకోవాలి. ఆహారాన్ని తీసుకునే సమయంలో మంచి నీటితో పాటు ఎలాంటి లిక్విడ్స్ కూడా తీసుకోకూడదు. కేవలం ఆహారాన్ని తీసుకున్న 30 నిమిషాల తర్వాత మాత్రమే మంచి నీళ్లు లేదా ఇతర లిక్విడ్స్ తీసుకోవాలి. ఇలా చేయడం చాలా అవసరం అని గుర్తుంచుకోండి. అంతే కాకుండా ఆహారం తీసుకునే 30 నిమిషాలు ముందు కూడా ఎలాంటి లిక్విడ్స్ తీసుకోకూడదు.

ఒకవేళ మంచి నీళ్ళను ఆహారం తీసుకునే సమయంలో తాగాలనుకుంటే చాలా నెమ్మదిగా సిప్ చేయాలి. ఎక్కువ మోతాదులో మంచి నీరును తీసుకోవడం వల్ల వాంతులు, వికారం, డయేరియా మరియు చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనబడతాయి.

ప్రతి రోజు ఆహారాన్ని బ్యాలెన్స్‌గా తీసుకోండి. ప్రొటీన్ ఉండే పదార్థాలను తప్పకుండా తీసుకోవాలి. ఎలాంటి ఆహార పదార్థాలలో అయితే ఎక్కువగా కొవ్వు పదార్థాలు, పంచదార ఉంటుందో వాటిని తీసుకోకపోవడమే మంచిది అని గుర్తుంచుకోండి.

ఆల్కహాల్ అస్సలు తీసుకోకూడదు. కెఫైన్ పీలైనంత వరకు తగ్గించండి, ఎందుకంటే కెఫైన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్‌కు గురి అవుతారు. విటమిన్, మినరల్స్ సప్లిమెంట్స్‌ను డాక్టర్ చెప్పిన విధంగా తప్పకుండా తీసుకోవాలి. అయితే ఆహారాన్ని తీసుకునేటప్పుడు ఎక్కువగా నమిలి తినాలి ఇలా చేయడం వల్ల జైజెషన్ ప్రక్రియ సులువుగా అవుతుందని గుర్తుంచుకోండి.

**లిక్విడ్స్ :** సర్జరీ అయిన రోజు లేక తర్వాత రోజు కేవలం లిక్విడ్స్ మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ మీరు క్లియర్ లిక్విడ్స్ తీసుకోవాలని అనుకుంటే వీటిని తప్పకుండా తీసుకోండి. పంచదార కలపకుండా ఎలాంటి జ్యూస్ అయినా తీసుకోవచ్చు. కెఫైన్ లేనటువంటి టీ, కాఫీ, స్కిమ్డ్ మిల్క్, సూప్ వంటివి తీసుకోవాల్సి ఉంటుంది. ఇది స్టేజ్ వన్‌కు సంబంధించిన లిక్విడ్ ఫుడ్.

**ప్యూరీడ్ ఫుడ్స్ :** వారం రోజుల వరకు లిక్విడ్స్ మాత్రమే తీసుకోమని డాక్టర్స్ సూచిస్తారు. కాకపోతే సర్జరీ చేసిన వారం తర్వాత మాత్రమే ప్యూరీడ్ ఫుడ్స్ తీసుకోవాల్సి ఉంటుంది అంటే వాటి కన్సిస్టెన్సీ అనేది స్మూత్ పేస్టులాగా, మెత్తగా ఉండాలి. ఈ విధంగా రోజుకు 3 నుండి 6 వరకు స్మాల్ మీల్స్‌గా తీసుకోవచ్చు. అయితే ఒక మీల్‌లో కేవలం నాలుగు నుండి ఆరు టేబుల్ స్పూన్ల ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని గమనించాలి.

ఇలా ప్యూరీడ్ ఫుడ్‌ని తీసుకుంటున్నా సరే ఆహారాన్ని చాలా నెమ్మదిగా తినాలి. అయితే ఈ విధమైన ప్యూరీడ్ ఫుడ్స్ తీసుకున్నప్పుడు ఎటువంటి సాలిడ్ ప్రిసెన్ ఆహారంలో ఉండకుండా చూసుకోవాలి. దీనిలో భాగంగా క్రీమి సూప్, గుడ్డు, కాటేజ్ చీజ్, గ్రౌండ్ మీట్ వంటి పదార్థాలతో పాటుగా ఒక లిక్విడ్‌తో బ్లెండ్ చేసుకుని తినొచ్చు. లిక్విడ్స్‌లో బ్లెండ్ చేయడానికి మంచి నీరు, స్కిమ్డ్ మిల్క్, జ్యూస్, సూప్ లాంటి లిక్విడ్స్‌ని ఉపయోగించవచ్చు.

**సాఫ్ట్ ఫుడ్ :** ప్యూరీడ్ ఫుడ్స్‌ను కొన్ని వారాల పాటు తీసుకున్న తరువాత సాఫ్ట్ ఫుడ్స్‌ను మీరు డైట్‌లో భాగంగా తీసుకోవచ్చు. కానీ మీరు తీసుకునే ఆహారం చాలా మెత్తగా మరియు తాజాగా ఉండేవే ఎంపిక చేసుకోండి. రోజుకు మూడు నుండి ఐదు స్మాల్ మీల్స్‌గా తీసుకోవాలి. సాఫ్ట్ ఫుడ్స్‌లో భాగంగా పొట్టు తీసి ఉడికించిన కూరగాయలు, అన్నం, గుడ్డు, ఫిష్, లీన్ మీట్ వంటి మొదలైన ఆహార పదార్థాలను తీసుకోవచ్చు.

**సాలిడ్ ఫుడ్ :** గ్యాస్ట్రిక్ బైపాస్ డైట్‌లో భాగంగా 8 వారాల తర్వాత సాలిడ్ ఫుడ్స్‌ను తీసుకోవచ్చు. సాలిడ్ ఫుడ్స్‌ని తీసుకున్నప్పుడు కొన్ని ఆహార పదార్థాలు నొప్పి, వికారం, వాంతులు వంటి వాటికి గురి చేస్తాయి. కాబట్టి వాటిని తీసుకున్నప్పుడు మీరు ఎలాంటి సమస్యలనైన ఎదుర్కొంటే కొన్ని మార్పులు చేసుకోండి. సాలిడ్ ఫుడ్స్ లో భాగంగా బ్రెడ్, కార్బొనేటెడ్ డ్రింక్స్, పచ్చి కూరగాయలు, ఉడికించిన కూరగాయలు, ఫ్రైడ్ ఫుడ్స్, పాప్ కార్న్ వంటి ఇతర స్పైసీ ఫుడ్స్ కూడా తీసుకోవచ్చు.

ఈ విధంగా గ్యాస్ట్రిక్ బైపాస్ డైట్ ని పాటించడం వల్ల సర్జరీ నుంచి త్వరగా రికవరీ అవుతారు. అంతేకాకుండా మీ ఆరోగ్యంతో పాటు బరువు కూడా పర్ఫెక్ట్‌గా ఉంటుంది. సర్జరీ తరువాత ఆనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు వలన ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. పైగా మోతాదుకు మించి ఆహారాన్ని తీసుకోవడం వలన ఎన్నో రకాల కాంప్లికేషన్స్‌ను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని గుర్తుంచుకోండి. కాబట్టి ఇలాంటి మార్పులను మీ డైట్‌లో చేసుకొని సర్జరీ నుండి వీలైనంత త్వరగా రికవరీ అవ్వండి.

# జ్ఞాపకశక్తికి అద్భుతమైన దివ్యౌషధం ఇదే

సాధారణంగా పాలను సూపర్ ఫుడ్‌గా పిలుస్తారు. అదే పాలలో కొద్దిగా ఎండు ద్రాక్ష మిక్స్ చేస్తే ఇక దివ్యౌషధమే. ఆహారపు అలవాట్లు, జీవనశైలి ఆధారంగా ఆరోగ్య స్థితి ఉంటుంది. ఆహారపు అలవాట్లు బాగుంటే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. లేకుంటే అనారోగ్య సమస్యలు వెంటాడుతాయి. మెరుగైన ఆరోగ్యం కోసం డైట్‌లో పాలు, ఎండుద్రాక్ష చేర్చుకుంటే చాలని అద్భుత ప్రయోజనాలు కలుగుతాయంటున్నారు వైద్య నిపుణులు.

ఎండుద్రాక్ష, పాలు. రెండూ ఆరోగ్యానికి చాలా మంచివి. రెండింట్లోనూ పోషక పదార్థాలు పుష్కలంగా లభిస్తాయి. ఎండుద్రాక్షలో హెల్తీ ఫ్యాట్స్, ఫైబర్, కాపర్, ఐరన్, కాల్షియం, పొటాషియం పుష్కలంగా ఉంటే పాలలో కాల్షియం, ప్రొటీన్లు, విటమిన్ డి అత్యధికంగా ఉంటాయి. అందుకే ఈ రెండూ కలిపి ప్రతిరోజూ తాగితే శరీరంలో పోషక పదార్థాల లేమి తలెత్తదు. ఫలితంగా గంభీరమైన రోగాలు దూరమౌతాయి. ఆరోగ్యం బాగుంటుంది.

**జ్ఞాపక శక్తి :** రోజూ క్రమం తప్పకుండా పాలు, ఎండుద్రాక్ష కలిపి తీసుకోవడం వల్ల ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యల్ని జయించవచ్చు. ముఖ్యంగా మెమోరీ పెరుగుతుంది. మెదడు పనితీరు అద్భుతంగా ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే బుద్ధి వికసితమౌతుంది. రాత్రి పడుకునేముందు పాలలో ఎండుద్రాక్ష కలిపి తాగడం వల్ల సుఖమైన నిద్ర పడుతుంది. నిద్రలేమి సమస్యతో బాధపడేవారికి ఇదొక మంచి ఔషధం కాగలదు. త్వరగా పడుకునేందుకు కూడా దోహదమౌతుంది.

**ఎముకలు పటిష్ఠం :** పాలు, ఎండుద్రాక్ష రెండింట్లోనూ కాల్షియం పుష్కలంగా ఉంటున్నందున ఈ రెండు కలిపి తీసుకోవడం ద్వారా ఎముకలకు బలం చేకూరుతుంది. ఎండుద్రాక్షలో ఉండే బోరాన్ అనే కెమికల్ ఎముకలకు చాలా లాభదాయకం. అటు కీళ్ల నొప్పులు కూడా తగ్గుతాయి. ప్రాక్చర్ కారణంగా ఏర్పడే గాయాలు తగ్గుతాయి. ఇతర చాలా గంభీరమైన రోగాలకు పాలు-ఎండుద్రాక్ష మిశ్రమం అద్భుతంగా పనిచేస్తుంది.

ఎండుద్రాక్షలో జీర్ణానికి తోడ్పడే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపర్చడమే కాకుండా మెటబోలిజంను వృద్ధి చేస్తుంది. శరీరంలో మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. కోలన్ పనితీరు మెరుగుపడుతుంది. శరీరాన్ని ఎప్పటికప్పుడు డీటాక్సీఫై చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటాము.

# ఉల్లిపాయలతో మధుమేహం నియంత్రణ

కొన్నేళ్లుగా మారిన జీవన శైలి, ఆహార అలవాట్లు, కాలుష్యం వంటి వాటి వల్ల మధుమేహం బాధితులు పెరిగిపోతున్నారు. ఒక్కసారి మధుమేహం బారిన పడితే జీవితాంతం జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి. ముఖ్యంగా ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. అయితే కొన్ని రకాల ఆహార పదార్థాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మన రక్తంలో చక్కెర స్థాయిలను, రక్త పోటును నియంత్రించడంలో తోడ్పుతాయి. అలా ఉల్లిపాయలు మధుమేహం నియంత్రణకు తోడ్పడుతాయని తాజాగా శాస్త్రవేత్తలు తమ పరిశోధనల్లో గుర్తించారు.

ఎండోక్రైన్ సొసైటీ సమావేశంలో అమెరికాలోని శాన్ డియాగోలో ఇటీవల జరిగిన 97వ ది ఎండోక్రైన్ సొసైటీ వార్షిక సమావేశంలో శాస్త్రవేత్తలు ఉల్లిపాయలు, మధుమేహంపై చేసిన పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఉల్లిలోని 'అల్లియమ్ సెపా' అనే పదార్థం మన రక్తంలో చక్కెర స్థాయిలు 50 శాతం వరకు తగ్గించేందుకు తోడ్పడుతున్నట్టు తాము గుర్తించినట్టు వెల్లడించారు. అంతేగాకుండా శరీరంలో కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచడంలోనూ పనిచేస్తున్నట్టు తెలిపారు.

**ఎలుకలపై పరిశోధన చేసి**

ఈ అంశానికి సంబంధించి ఎలుకలపై పరిశోధన చేశామని శాస్త్రవేత్తలు వివరించారు. మొత్తం నాలుగు గ్రూపులుగా ఎలుకలను తీసుకున్నామని అందులో ఒక గ్రూపు మధుమేహం లేని ఎలుకలు అని చెప్పారు. మధుమేహం ఉన్న మూడు గ్రూపుల్లోని ఎలుకలకు ఉల్లి నుంచి తీసిన పదార్థాలను వేర్వేరు డోసుల్లో అందించి పరిశీలించామని తెలిపారు.

మధుమేహం ఉన్న మూడు గ్రూపుల్లోని ఎలుకల్లో 'అల్లియమ్ సెపా' డోసు ఎక్కువగా ఇచ్చిన గ్రూపులో రక్తంలో చక్కెర స్థాయిలు బాగా నియంత్రణలో ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. అదే సమయంలో వాటిలో కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా తగ్గాయని వివరించారు.

ఉల్లిపాయలు తీసుకోవడం వల్ల మరో లాభం కూడా ఉందని వాటి వల్ల పెద్దగా కెలోరీలు కూడా అందకపోవడం వల్ల అంతిమంగా శరీరంలో గ్లూకోజ్ శాతం పెరిగే పరిస్థితి కూడా ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనికి సంబంధించి మనుషులపైనా ప్రయోగాలు చేయాల్సి ఉందని వివరించారు.

# ఖాళీ కడుపుతో ఉదయాన్నే దానిమ్మ జ్యూస్ తాగితే

ఆరోగ్యకరమైన శరీరం పొందడానికి, ఖచ్చితంగా ఆహారంలో పండ్లు, వాటి రసాన్ని చేర్చుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయి. ఇలాంటి వాటిలో దానిమ్మ పండు ఎంతో ఉత్తమంగా పని చేస్తుంది. రోజూ దానిమ్మ రసం తాగడం వల్ల ప్రయోజనాలు ఉన్నాయి. ఇది మీ శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని రుజువు చేస్తుంది. అయితే ఉదయాన్నే ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల అనేక వ్యాధులు నయం అవుతాయని మీకు తెలుసా. ఉదయాన్నే పరగడుపున దానిమ్మ రసం తాగితే రోజంతా శరీరంలో శక్తి ఉంటుంది. శరీరంలో రక్తం లేకపోవడం తొలగిపోయి హిమోగ్లోబిన్ పెరుగుతుంది. విటమిన్ కె, విటమిన్ బి, విటమిన్ ఎ, విటమిన్ డి, కాల్షియం, పొటాషియం, జింక్, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్, ఫైబర్, ప్రొటీన్లు కూడా దానిమ్మ రసంలో ఉన్నాయి.

1- రక్తహీనత దూరం- మీ శరీరంలో ఐరన్ లోపం ఉంటే మీరు రక్తహీనతకు గురైనట్లయితే, మీరు తప్పనిసరిగా దానిమ్మ రసం తాగాలి. రోజూ ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల శరీరానికి తగినంత ఐరన్ అందుతుంది. దీని కారణంగా, శరీరంలో ఎర్ర రక్త కణాలు పెరుగుతాయి. రక్తహీనత ఫిర్యాదు అనే సమస్య ఇకపై రాదు.

2- రోగనిరోధక శక్తిని పెంచండి- ప్రతి రోజూ ఉదయం ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. దానిమ్మ రసంలో విటమిన్ సి, విటమిన్ ఎ, ఐరన్ పుష్కలంగా ఉన్నాయి. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. శరీరాన్ని వ్యాధుల నుంచి దూరంగా ఉంచుతుంది.

3- ముఖం మెరిసిపోతుంది- దానిమ్మ రసం చర్మానికి కూడా చాలా మేలు చేస్తుంది. రోజూ దానిమ్మరసం తాగడం వల్ల చర్మం మెరుస్తుంది. దానిమ్మలో యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్ ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా, మెరిసేలా చేస్తాయి.

4- గర్భిణీ స్త్రీలకు ప్రయోజనకరమైనది- గర్భధారణ సమయంలో, మహిళల శరీరంలో విటమిన్లు, ఇనుము లేకపోవడం తరచుగా ఉంటుంది. ఇటువంటి పరిస్థితిలో గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా దానిమ్మ రసం తాగాలి. దీని కారణంగా, శరీరంలో విటమిన్లు, ఐరన్ లోపం నెరవేరుతుంది. శరీరంలో రక్తానికి కొరత ఉండదు. శక్తి కూడా లభిస్తుంది.

5- గుండెకు మేలు చేస్తుంది- రోజూ దానిమ్మ రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మలో కొలెస్ట్రాలేని తగ్గించే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇది గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా దానిమ్మ రసం ఖాళీ కడుపుతో తాగడం వల్ల చాలా మేలు జరుగుతుంది.

6- రక్తపోటు నియంత్రణ- దానిమ్మపండులో పొటాషియం పుష్కలంగా లభిస్తుంది. అధిక రక్తపోటు ఉన్నవారు తప్పనిసరిగా దానిమ్మ రసం తాగాలి. ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

# కరివేపాకుతో జుట్టుకు అనేక లాభాలు

కరివేపాకు. దీనికి కొన్ని ప్రాంతాల్లో కళ్యామాకు అని కూడా అంటారు. చెట్టు సుగంధభరితమైన ఆకులు గల ఒక అందమైన పొద మొక్క లేదా చిన్న చెట్టు. దీని ఆకులని కరివేపాకు అంటారు. మీ అందరికీ బాగా పరిచయం ఉంటుంది. మసాలా దినుసులు, మీ కూరగాయలను రుచిగా మార్చడంలో దీని పాత్ర అధికంగా ఉంటుంది. ఇది ఎక్కువగా ఇండియా, శ్రీలంకలలో కనిపిస్తుంది. కూర, చారు, పులుసు, వగైరా వంటకాలలో సువాసనకోసం వాడుతారు. అంతేకాదు కరివేపాకు వంటలను రుచికరంగా మార్చడంలో మాత్రమే కాకుండా మీ అందాన్ని మరింత మెరుగులు దిద్దడంలో కూడా సహాయ పడుతాయి. వాస్తవానికి, కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. దీనితో పాటు కరివేపాకులో బి విటమిన్లు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఇవి హెయిర్ ఫోలికల్స్‌లో మెలనిన్ ఉత్పత్తి చేయడానికి పని చేస్తాయి. దీంతో జుట్టు నల్లగా, తెల్లజుట్టు సమస్య దూరమవుతుంది. కనుక ఇది కొంత ప్రభావం చూపుతుంది.

జుట్టు కోసం కరివేపాకుతో ప్రయోజనాలు

కరివేపాకు కూడా జుట్టు తెల్లబడకుండా కాపాడుతుంది. వాస్తవానికి, కరివేపాకు మెలనిన్ ఉత్పత్తి చేయడానికి పని చేస్తుంది. మెలనిన్ లోపం వల్ల జుట్టు తెల్లగా మారుతుంది. ఇలాంటి సమయంలో కరివేపాకుతో చేసిన హెయిర్ మాస్క్‌ని జుట్టుకు అప్లై చేయడం వల్ల జుట్టు నెరిసే సమస్య దూరం అవుతుంది. దీనితో పాటు, జుట్టు కూడా మృదువుగా, ఆరోగ్యంగా మారుతుంది.

కరివేపాకు హెయిర్ మాస్క్ ఎలా తయారు చేయాలి

గ్యాస్ మీద పాన్లో, 2 టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనెను వేడి చేయండి.

ఇప్పుడు దానికి 10-12 కరివేపాకు వేసి 3-4 నిమిషాలు ఉడికించాలి. అప్పుడు గ్యాస్ ఆఫ్ చేయండి.

ఇప్పుడు 20 నిమిషాలు చల్లబరచడానికి పక్కన పెట్టండి. మీ కరివేపాకు హెయిర్ మాస్క్ సిద్ధంగా ఉంది.

కరివేపాకు హెయిర్ మాస్క్ ఎలా అప్లై చేయాలి

జుట్టు మీద కరివేపాకు మాస్క్ అప్లై చేయడానికి, రెండు చేతులతో మొత్తం జుట్టు మీద అప్లై చేయండి. ముందుగా ఈ మాస్క్‌తో హెయిర్ రూట్‌లను మసాజ్ చేసి, తర్వాత జుట్టు మొత్తానికి బాగా అప్లై చేయండి. ఒక గంట తర్వాత, ఇప్పుడు జుట్టును బాగా కడగాలి. మీ జుట్టు చాలా మృదువుగా మెరిసేలా మారడం మీరు చూస్తారు.

కరివేపాకు, పెరుగుతో కూడా హెయిర్ మాస్క్ తయారు చేసుకోవచ్చు

మీరు కరివేపాకు, పెరుగుతో హెయిర్ మాస్క్‌ని కూడా తయారు చేసుకోవచ్చు. ఈ మాస్క్ చుండ్రును తొలగించడంలో కూడా సహాయ పడుతుంది. దీని కోసం, ఒక గిన్నె పెరుగులో 3-4 కరివేపాకులను పేస్ట్ అయ్యే వరకు కలపండి. తర్వాత జుట్టుకు బాగా పట్టించాలి. ఇది మీ జుట్టుకు చాలా మేలు చేస్తుంది.

## సెయింట్ జోసెఫ్ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా అంతర్ కళాశాలల పోటీలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల భాషాకేంద్ర ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల అకడమిక్ పోటీలు నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ సైజి తెలిపారు. లాంగ్వేజ్ సెంటర్ కోఆర్డినేటర్ ఆంగ్ల అధ్యాపకురాలు ఏజాన్సందన మాట్లాడుతూ తెలుగు, హిందీ, సంస్కృత, ఆంగ్ల భాషల్లో విద్యార్థుల సృజనకు పదును పెడుతూ నిర్వహించిన వివిధ పోటీలలో తమ కళాశాల విద్యార్థులతో పాటు నగరంలో 10కి పైగా కళాశాలల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ముఖ్య అతిథి, ప్రెస్ ఇన్చార్జ్, ద్వితీయ భాషా విభాగ అధ్యక్షురాలు డా॥ పి.కె. జయలక్ష్మి మాట్లాడుతూ మాతృ భాషలో పట్టు సాధించిన విద్యార్థులు విద్యారంగంలో బాగా రాణిస్తారని తెలిపారు. అంతే కాకుండా సృజనాత్మకత విద్యార్థుల్లో పెంపొందుతుందని పేర్కొన్నారు. సాయంత్రం ముగింపు కార్యక్రమంలో విజేతలకి ప్రమాణపత్రాలు అందచేసారు. గాయత్రి, ప్రజమ్, ఆదిత్య కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

## గురుప్రసాద్‌కు జాతీయ ప్రతిభా పురస్కారం

**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బి.సి.సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖామాత్యులు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ చేతుల మీదుగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ రచయిత, తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ జాతీయ ప్రతిభా పురస్కారాన్ని స్వీకరించారు. రాజమండ్రిలో ప్రకాష్‌నగర్ ధర్మంచర కమ్యూనిటీ హాల్‌లో ఫిలాంత్రోపిక్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ అద్దంకి రాజా ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ వేడుకల్లో గోదావరి కళాదర్బార్ పేరిట వేడుకలు నిర్వహించారు. త్రిశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షులు డాక్టర్ కత్తిమంద ప్రతాప్ అధ్యక్షత వహించగా, ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ కార్యదర్శి యం.బాల గంగాధర్ తిలక్, రాజమండ్రి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కుడుపూడి పార్థసారథి, తెలంగాణా కళాపరిషత్ అధ్యక్షులు డాక్టర్ పగిడిపల్లి రాజారావు, శ్రీ విజ్ఞానవేదిక అధ్యక్షులు చెఱుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయిలో విభిన్న రంగాలలో కృషి చేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులకు పురస్కారాలను ప్రదానం చేసారు.

## వైభవంగా శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి సహస్ర నామార్చన

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశికి 100 సంవత్సరంలో ప్రవేశిస్తున్న శుభ సందర్భంగా అమ్మవారి ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా అర్చక ఎగ్జామినర్ రేణిటి రామాచార్యులు వారి ఆధ్వర్యంలో గురువారం ఆలయ మండపంలో అమ్మవారికి 1008 గాజులతో సహస్ర నామార్చన, నిత్య అర్చన, వేషం కుంకుమ పూజ, నీరాజనం, మంత్రపుష్పం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రతిష్ఠ శత జయంతి ఉత్సవముల చైర్మన్ కొరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేఖ కుమార్, ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరా సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ పుప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# వైజాగ్ హీరోయిన్ రేఖా భోజ్‌కి అరుదైన గౌరవం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖకి చెందిన ప్రముఖ హీరోయిన్ రేఖా భోజ్ కి యూట్యూబ్‌లో రేఖా భోజ్ అఫీషియల్ అనే తన చానెల్‌కి ఒక లక్షమంది సబ్స్క్రైబర్స్ అయిన సందర్భంగా యూట్యూబ్ వారు సిల్వర్ ప్లేబటన్ అందజేశారు. ఈ సందర్భంగా విశాఖ పౌర గ్రంధాలయం నందు ఆమెకు అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పాల్గొని ఆమెను అభినందించి సత్కరించారు. ఆత్మీయ అతిథిగా వి టీవీ అధినేత, కార్మిక నాయకులు సినీ నిర్మాత వి.వి.వామన రావు మాట్లాడుతూ లక్ష మంది సబ్స్క్రయిబ్ అవ్వడం అంత ఈజి కాదని ఎంతో కష్టపడి పని చేస్తే గాని ఈ యూట్యూబ్ సిల్వర్ ప్లే బటన్ అవకాశం రాదని అటువంటి అవకాశాన్ని సాధించిన రేఖా భోజ్ ను అభినందించారు. తను తీయబోయే తదుపరి చిత్రం లో హీరోయిన్ గా అవకాశం ఇస్తానని మాట ఇచ్చారు. అలాగే మిగతా అతిథులుగా పాల్గొన్న సినీ దర్శకులు మీగడ శివత్రి, పాతిన రమేష్, త్రినాథ్, ఉదయ్, ఆర్టిస్ట్ జూనియర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు. దర్శకులు రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో బాదంగిర్ సాయి అధ్యక్షతన సభా కార్యక్రమం జరిగింది. రేఖా భోజ్ మాట్లాడుతూ తను సాధించిన ఈ విజయం వెనుక తన కెరీర్ కోసం నిరంతరం పరితపించే తన టీమ్ సభ్యులు ఉండటం వల్లే ఈ విజయం తన సొంతం అయ్యిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమానికి నగర కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సెయింట్ జోసెఫ్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సదస్సు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల వృక్షశాస్త్ర విభాగం మరియు ఐక్యూఏసీ సహకారంతో రెండు రోజుల జాతీయ కాన్ఫరెన్స్ గురువారం ఉదయం ప్రారంభమైంది.

ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సిలర్ ప్రొఫెసర్ పి వి జి డి ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ సహసంచాలకులు డాక్టర్ పి వి కే జగన్నాథరావు విశిష్ట అతిథిగా విచ్చేసి దీపప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథి, ఉపకులపతి డాక్టర్ పివిజిడి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ యంత్రాల పాలనలో మానుకుపోతున్న తరం మనది. కృత్రిమ మేధ యొక్క అభివృద్ధి ప్రతి రంగంలోనూ ఉపయోగపడుతోందని, ఈ రంగంలో ఆదర్శప్రాయమైన పురోగతి ఉందన్నారు. బయోలాజికల్ సైన్సెస్ విద్యార్థులు విద్యా రంగంపై దృష్టి సారించాలని మరియు ఈ రంగంలో సాంకేతిక పురోగతిని సాధించాలని ఆయన కోరారు. సమావేశాన్ని ఉద్దేశించి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా డాక్టర్ పి.వి.కె. జగన్నాథరావు, పంట ఆనంతర దిగుబడిలోనష్ట నివారణకు సాంకేతిక నైపుణ్యాల గురించి కీలక ప్రసంగం చేశారు.

వృక్షశాస్త్రం మరియు అనుబంధ జీవశాస్త్రాలలో వ్యవసాయం, బయోటెక్నాలజీ,నానోటెక్నాలజీ, బయోసిస్టమాటిక్స్, హెర్బేరియం డిజిటలైజేషన్, హెర్బల్ టెక్నాలజీ, ఫార్మసీ, బయోడైవర్సిటీ కన్జర్వేషన్ మరియు క్లైమేట్ చేంజ్ రెసిలెన్స్, ఉపశమనాలు మరియు గ్రీన్ టెక్నాలజీస్ వంటి ఇతివృత్తాలతో సదస్సు జరుగుతుందని సదస్సు కన్వీనర్, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె. మాణిక్య కుమారి తెలిపారు. బయోలాజికల్ సైన్సెస్‌లోని వివిధ రంగాలలో ఇటీవలి అభివృద్ధి మరియు సాంకేతికతలపై దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకమైన జాతీయ సంస్థలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు, రిసోర్స్ పర్సన్లు చర్చలు జరపబోతున్నారని ఆమె చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు డాక్టర్ పద్మ సుందరి, సిస్టర్ హేమ, డాక్టర్ నాగరాజు, కార్యవర్గ సభ్యులు, డా॥ ఇ. హరిణి, డా॥ మేరీ అనుపమ, ప్రెస్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ పి. కె. జయలక్ష్మి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సుధ పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై దాడులు ఆపాలి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను తక్షణమే ఆపాలని లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎన్ఎ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. సత్యనారాయణ, ధవలేశ్వరరావు రవికుమార్ డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫోటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం దారుణమని మండి పడ్డారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో మీడియా సంస్థల కార్యాలయాలపై దాడులు పత్రికా స్వేచ్ఛకు విఘాతమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యాల చర్యలకు జర్నలిస్టులు బాధ్యులు కారని వారి వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తుంటే ఈ దౌర్జన్యాల ఏంటని ప్రశ్నించారు. జర్నలిస్టులపై దాడులు ప్రేరేపించే విధంగా అన్ని రాజకీయ పార్టీల నాయకుల వ్యాఖ్యలు ఆపాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులను ఉపయోగించుకుని అధికారంలోకి వస్తూ పాలన సాగిస్తున్న పార్టీలు తిరిగి వారిపై దాడులేంటని మండిపడ్డారు. జర్నలిస్టుల చర్యలు చట్ట విరుద్ధమనిపిస్తే పోలీసులు, కోర్టులను ఆశ్రయించాలి తప్ప దాడులు సరికాదని హితవు పలికారు.

జర్నలిస్టులపై దాడుల నివారణకు గతంలో మాదిరిగానే రాష్ట్ర, జిల్లా స్థాయిలో జర్నలిస్టు సంఘాల ప్రాతినిధ్యంతో అటాక్స్ నివారణ కమిటీలను ఏర్పాటు చేయాలని, కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఎస్పీలు కలిగిన ఆ కమిటీలలో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షించి జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి వేయాల్సిన కమిటీలు గత ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఒకసారి వేసినప్పటికీ ఐదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా సమావేశం నిర్వహించలేదని, ఈ ప్రభుత్వం అయితే కమిటీలే వేయలేదని గుర్తు చేసారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న జర్నలిస్టులపై దాడులు మాత్రం ఆగటం లేదన్నారు.మానవ హక్కుల కమిషన్, ఎస్సీ ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్‌ల మాదిరిగానే జాతీయ స్థాయిలో మీడియా స్వేచ్ఛ, జర్నలిస్టుల హక్కులు, రక్షణ కొరకు స్వతంత్ర అధికారాలు కలిగిన మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

## ఎంపీ, ఎంపీపీ సత్యనారాయణ పాదయాత్రకు అడుగు అడుగున ప్రజాదరణ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 9వ వార్డులో పార్లమెంట్ సభ్యులు, తూర్పు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ పాదయాత్ర.

విశాఖ తూర్పు నియోజకవర్గంలో పాదయాత్రకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని గౌరవసీయులు విశాఖ పార్లమెంట్ సభ్యులు, వైసీపీ, తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు 46వరోజు గురువారం హనుమంతవాక జంక్షన్, రామాలయం నుండి వార్డ్ కార్పొరేటర్ ఉమ్మడి స్వాతి దాస్ తో కలిసి పాదయాత్ర నిర్వహించారు.

ఎంవీపీ సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలో 46రోజుల నుండి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామని గురువారం ప్రతి గడపగడపకు వెళ్లిపాదయాత్రగా వెళ్లి వారి సమస్యలను అడగగా మాకు ఏ విధమైన సమస్యలు లేవని మరల ఏపీ ముఖ్యమంత్రిగా సంక్షేమ సారథి జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించే దిశగా నమిష్టిగా అయనకే మద్దతువలుకుతామని ప్రజలు అంటున్నారన్నారు.

కార్యక్రమంలో మహిళలు పార్టీ శ్రేణులు, అభిమానులు, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు చైర్మన్లు వివిధ అనుబంధ సంఘాల నాయకులు పార్టీ శ్రేణులు మహిళలు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో ఎక్కడైనా మిగిలిపోయిన అర్హత గల ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అనర్హుల ఓట్ల తొలగింపులో కూడా పగడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈవీఎంలలో ఓటింగ్ చేయడంపై అవగాహన కార్యక్రమాలు ముమ్మురంగా చేస్తున్నట్లు తెలిపారు. అప్ అండ్ పార్టీ వారు చెప్పిన విధంగా కొత్తగా ఓటు హక్కు పొందిన వారితో పాటు యువ ఓటర్లకు కళాశాలలో అవగాహన కలిగించడం జరుగుతుందని చెప్పారు. ఓటర్ల జాబితా తయారీలో అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియజేయాలన్నారు. గత నెల రోజులలో 12,347 దరఖాస్తులు అభ్యంతరాలు రాగా వాటిలో 5738 ఆమోదించి 650 తిరస్కరించడం జరిగిందని 5959 వివిధ దశల్లో పెండింగ్లో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బొలిశెట్టి శ్రీనివాసరావు, రామకృష్ణ (వైసిపి), కే.హరినాథ బాబు, కొల్లి రాపు (ఆమ్ ఆద్మీ), ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ డి. రామ్మూర్తి, డి.టి. రవికుమార్, ఎస్.ఏ. తులసిరామ్, తదితరులు పాల్గొన్నారు.

# "సమ్మక్క సారలక్క జాతర"

తెలంగాణా రాష్ట్రంలో మిక్కిలి ప్రసిద్ధి చెందిన గిరిజన జాతర సమ్మక్క, సారలక్క జాతర. వరంగల్ జిల్లా, ములుగు మండలంలో 'మేడారం' అనే గ్రామం ఉంది.అక్కడి ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే అతి ముఖ్యమైన జాతర సమ్మక్క, సారలక్క జాతర.

మేడారం ఒక కోయగూడెం. ఒకరోజు అడవిలో కోయలు తిరుగుచున్నారు. వారికి దారిలో చందమామలాంటి ఒక చిన్న పాప కనిపించింది. అడవిలోని కరజంతువులు ఆ పానను ఏమీ చేయలేదు. ఆ చిన్న పాప కూడా నిర్భయంగా జంతువులతో ఆడుకుంటూ సంతోషంగా ఉంది. కరజంతువులు కూడా ఆ చిన్నారిని ఏమీ చేయకుండా తమదారిన తాము పోవడం వారికి ఆశ్చర్యాన్ని కలిగించింది. దాంతో ఆ చిన్నారి బాలిక సామాన్యురాలు కాదని, దైవానుగ్రహం కలదని వారికి తోచింది. ఆ పానను తమతో కోయగూడేనికి తీసుకుని వచ్చారు.

ఆమెను 'కొండదేవత'గా భావించి పూజింప సాగారు. ఆమెకు 'సమ్మక్క' అనే పేరు పెట్టి, కన్నకూతురిలా పాపించారు. శుక్లపక్షంలోని చంద్రునిలా ఆమె దినదిన ప్రవర్ధమాన మవుతూ పెరుగుతోంది. చిన్నతనం నుండి ఆమె ఎన్నో మహిమలు చూపింది. దృష్టి లేని వారికి దృష్టిని అనుగ్రహించింది. కుంటివారికి నడక వచ్చేటట్లు చేసింది. కొండ ప్రాంతంలో నివసించే ప్రజలకు వచ్చే ఎన్నో రకాల నయంకాని రోగాలను తన చల్లని చూపుతో నయం చేసింది. అక్కడి ఆటవిక ప్రజలకు ఆరాధ్యదేవత అయింది. సమ్మక్క రాకతో ఆ పల్లె తీరే మారిపోయింది.

సమ్మక్క మహాత్మ్యం చుట్టుప్రక్కల గ్రామాల వారికి తెలిసింది. దానితో ఆమె మహిమ నలుదిక్కులా విస్తరించింది. ప్రజలందరూ ఆమెను భక్తి శ్రద్ధలతో దర్శించి, సేవించారు. సమ్మక్కకు యుక్తవయస్సు వచ్చింది. పైడి రాజును సమ్మక్కకు తగిన జోడుగా భావించి, వారిద్దరికీ వైభవముగా వివాహము జరిపించారు. ఆ దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు కలిగారు. వారికి సారలమ్మ, జంపన్న అనే పేర్లు పెట్టారు.

కాకతీయులు గిరిజనులను కప్పం కట్టమని తీవ్రంగా వత్తిడి చేశారు. నిరుపేదలైన గిరిజనులు కప్పం కట్టలేక ఎన్నో ఇబ్బందులు పడ్డారు. సమ్మక్క, పైడిరాజు దంపతులు గిరిజనులకు స్వతంత్ర జీవన విధానాలను నూరిపోశారు.

వారిద్దరూ ఇకపై గిరిజనులు కప్పం కట్టరని చెప్పి సిపాయిలను వెనక్కి పంపేశారు. దానికి ఆగ్రహించిన దళాధిపతి సైన్యంతో మేడారం మీదకు దండెత్తి వచ్చాడు. గిరిజనులకు, కాకతీయులకు సైన్యానికి మధ్య 'సంపంగి వాగు' ఒడ్డున సంకుల సమరం జరిగింది. సారలమ్మ, పైడిరాజులు కాకతీయుల సైనికుల చేతిలో మరణించారు. బాగా గాయపడిన జంపన్న సంపంగి వాగులో తూలి పడ్డాడు. అప్పటి నుండి అది 'జంపన్నవాగు' గా పేరు పొందింది.

సమ్మక్క శత్రు సైన్యాన్ని చీల్చిచెండాడింది. కాకతీయ సైన్యం ఆమె ధాటికి ఎదురు నిలబడ లేక పిక్క బలం చూపింది. తన సైన్యం పారిపోవటం చూసిన సైన్యాధిపతికి దిక్కు తోచలేదు. దొంగచాటుగా సమ్మక్కను వెన్నుపోటు పొడిచి గాయపరిచాడు. ఆ మరుక్షణమే సమ్మక్క అదృశ్యమైంది. మళ్ళీ కనిపించ లేదు. దాంతో విజయోత్సాహంతో కాకతీయ సైన్యం వెనుతిరిగింది. గిరిజనులు తమను ఆదరించిన తల్లి కనిపించకపోవడంతో అల్లాడిపోయారు.

ఏకవీర దేవత యువరాజు ప్రతాపరుద్రుని కలలో కనిపించి, గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దమని చెప్పింది. వారికి హానిజరిగితే, పెద్ద ఉపద్రవం వాటిల్లుతుందని హెచ్చరించింది. సమ్మక్క, సారక్క, పైడిరాజు, జంపన్నలు దైవాంశ సంభూతులని, వారికి భక్తితో జాతరను ఘనంగా నిర్వహించమని చెప్పి అదృశ్యమైంది. దానితో ప్రతాపరుద్రునికి జ్ఞానోదయమైంది. ప్రతాపరుద్రుడు గిరిజనులు కప్పం కట్టవద్ద సరంలేదని ప్రకటించాడు. కళ్ళకు కనుమరుగైనా, గిరిజనులను కంటికి రెప్పలా కాపాడుతూ నేటికీ సమ్మక్క గూడెం ప్రజల గుండెల్లో గూడు కట్టుకుంది. మేడారంలో ఆనాటి నుండి ఈనాటి వరకు సమ్మక్క, సారలక్క జాతర జరుగుతోంది. భక్తులపాలిట కల్పవృక్షంలా సమ్మక్క నేటికీ వారి కోరికలు తీరుస్తుంది.

ఈ జాతరను ప్రతీ రెండు సంవత్సరములకు ఒకసారి జరుపుకుంటారు. ఈ జాతరకు మన తెలుగు రాష్ట్రాలనుండే కాక పొరుగు రాష్ట్రాల నుండి కూడా జనం అధిక సంఖ్యలో వస్తారు. భక్తులు దేవతకు బెల్లాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ జాతరలో మొదటిరోజు సమ్మక్క జాతర, రెండవరోజు సారక్క జాతర జరుగుతుంది. నుగాలీలు, కోయులు మొదలైన గిరిజనులే కాక నాగరికులు కూడా కుల, మత, జాతి, భేదాలు పాటించకుండా ఈనాటికీ భక్తితో సమ్మక్కను కొలుస్తారు. ఈ జాతరను నాలుగు రోజులు జరుపుకుంటారు.

## కోడి పందెల శిబిరం పై పోలీసులు దాడి

**చోడవరం, (విశాఖ సమాచారమ్):** బుచ్చయ్యపేట మండలం దిబ్బిడి గ్రామంలో బహిరంగంగా నిర్వహిస్తున్నారని అందిన సమాచారం మేరకు కోడి పందెం ఆట శిబిరం పై బుచ్చయ్య పేట పోలీసులు దాడులు నిర్వహించి ఒక కోడిపుంజు, 5 గురు వ్యక్తులు వద్ద నుండి రూ. 10,220 నగదు స్వాధీనం చేసుకోని వారి పై కేసు నమోదు చేశామని బుచ్చయ్యపేట ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. మండలంలో కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని మండల ప్రజలను ఎస్ఐ హెచ్చరించారు.

## గొలుసు దుకాణాలపై సీఐ ఉక్కు పాదం

**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పరవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన సీఐ బాల సూర్యారావు నాటి నుండి అక్రమ మద్యం, గొలుసు దుకాణాలపై ఉక్కుపాదం, మోపారు. పరవాడ మండలం తానాం గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి తన పాన్ షాపులో మద్యం అమ్మడానికి తీసుకెళ్తుండగా దాడులు చేశారు. ఆమె వద్ద 48 (180 ఎంఎల్) మద్యం సీసాలు పట్టుబడ్డాయి. ఆ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పరుస దాడులతో గొలుసు దుకాణదారులు బెంబేలెత్తుతున్నారు. పక్కా సమాచారంతో 36 రోజుల్లో 38 కేసులు నమోదు సిఐ నమోదుచేశారు.

## అపర భగీరథుడు జగన్మోహన్ రెడ్డి

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉద్దానం కిడ్నీ బాధితులకు సురక్షిత నీటిని అందించిన జగన్మోహన్ రెడ్డి అపర భగీరథుడని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు అన్నారు. 40 ఏళ్లుగా కిడ్నీ వ్యాధితో యింటి కొకరు చనిపోతుంటే ఇంత వరకు ఏ రాజకీయ నాయకుడు పట్టించుకోని శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో 742కోట్లతో హీరమండలం రిజర్వాయర్ నుంచి పైపు లైన్లు ద్వారా వంశధార నీటిని శుద్ధి చేసి, 249 ఓవర్ హెడ్ ట్యాంకులు ద్వారా 1044కి.మీ. పైపు లైన్ ఏర్పరచి, 27 బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, 18 అండర్ గ్రౌండ్ రిజర్వాయర్లు నిర్మించి, 807 బాధిత గ్రామాల్లో ఉన్న ప్రతి యింటికి రోజుకి 100 లీటర్లు చొప్పున పరిసర గ్రామాలతో సహా 6 లక్షల 78 వేల మందికి సురక్షిత నీటిని అందించి, వారందరి ప్రాణాలు కాపాడిన అపరభగీరథుడు జగన్మోహన్ రెడ్డి లాంటి నాయకుడు మరల ముఖ్యమంత్రి కావటం తథ్యమని రమణ అప్పారావు అన్నారు.

### జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ నివాసంలో సీబీఐ సోదాలు



జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ నివాసంలో సీబీఐ అధికారులు సోదాలు చేపట్టారు. కీరు హైడ్రో ఎలెక్ట్రిక్ ప్రాజెక్టు అవినీతి కేసులో తనిఖీలు నిర్వహిస్తున్నారు. 30 చోట్ల ఏకకాలంలో సోదాలు జరుపుతున్నారు. ఈ సెర్చ్ ఆపరేషన్లో దాదాపు 100 మంది అధికారులు తనిఖీలు నిర్వహించారు. కీరు హైడ్రో ఎలెక్ట్రిక్ ప్రాజెక్టుకు చెందిన సివిల్ పనుల కేటాయింపుల్లో రూ. 2,200 కోట్ల విలువైన అవినీతి జరిగిందని కేసు నమోదయింది.

2018 ఆగస్ట్ నుంచి 2019 అక్టోబర్ వరకు జమ్మూకశ్మీర్ గవర్నర్గా సత్యపాల్ మాలిక్ ఉన్నారు. ఆ సమయంలో తన వద్దకు రెండు ఫైల్స్ వచ్చాయని, వాటిపై సంతకం చేస్తే రూ. 300 కోట్లు వస్తాయని తన సెక్రటరీలు చెప్పారని, అందులో హైడ్రో ప్రాజెక్టది ఒక ఫైల్ అని గతంలోనే ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

ఈ సోదాలపై సత్యపాల్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ అనారోగ్య కారణాలతో తాను అనుపత్రిలో చికిత్స పొందుతున్నానని చెప్పారు. తాను అనారోగ్యంతో ఉన్నప్పటికీ నిరంకుశ శక్తులు తన నివాసంపై దాడులు చేస్తున్నాయని మండిపడ్డారు. తన డ్రైవరును, సహాయకుడిని వేధిస్తున్నారని అన్నారు. ఇలాంటి వాటికి తాను భయపడనని చెప్పారు. రైతులకు తాను అండగా ఉంటానని అన్నారు.

## మంత్రి ధర్మాన వ్యాఖ్యలపై ఈసీకి ఫిర్యాదు చేసిన అచ్చెన్నాయుడు

అవసరమైతే వాలంటీర్లు ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్ ఏజెంట్లుగా కూర్చోవాల్సి ఉంటుందని మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. మంత్రి ధర్మాన వ్యాఖ్యలను ఏపీ టీడీపీ చీఫ్ అచ్చెన్నాయుడు తప్పుబట్టారు.

ధర్మాన వ్యాఖ్యలను అచ్చెన్నాయుడు కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. సాక్ష్యాధారాలతో ఈసీకి ఫిర్యాదు చేశారు. వాలంటీర్లు ఎన్నికల విధులో ఉండరాదన్న ఆదేశాలను మంత్రి ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. చర్యలు తీసుకోవాలని ఈసీని కోరారు.

80 ఏళ్లకు పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఇస్తున్నారని, వాళ్లతో ఓటేయించే విషయంలో వాలంటీర్లు కీలకపాత్ర పోషించాలని ధర్మాన ప్రసాదరావు నిన్న జరిగిన ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు.

వాలంటీర్లకు సర్వీస్ రూల్స్ ఏవీ లేవని, వారు బూత్ ఏజెంట్లుగా ఉండేందుకు ఎలాంటి అభ్యంతరాలు ఉండవని అన్నారు. ఎవరికి ఓటు వేయాలో చెప్పాల్సింది మీరే కదా అంటూ వాలంటీర్లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

## అమ్మా, నాన్నల సేవా త్యాగాలను గుర్తించాలి-శ్రీ చైతన్య

**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** కనిపించని ఆ దైవం ఎంతో నవ మాసాలు మోసి, కని పెంచే తల్లిదండ్రులూ అంతే అమ్మానాన్నలు దేవుళ్లతో సమానం. జన్మనిచ్చి ఇంతటి వారిని చేసిన తల్లిదండ్రులకు ఏమిచ్చిన రుణం తీర్చుకోగలం. ప్రత్యక్షదైవాలైన వారిని వదిలేసి కనిపించని దేవుడి కోసం గుళ్ల, గోపురాల చుట్టూ తిరుగుతాం. పూజించక పోయినా పర్వాలేదు గానీ వారి ఆదరించాలని యలమంచిలి శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ హృషికేష్ దాస్ అన్నారు. స్కౌట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాలలో అరువైన గొప్ప కార్యక్రమమైన విద్యార్థులచే తల్లిదండ్రులకు పాదపూజ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హృషి కేష్ దాస్ మాట్లాడుతూ సమస్త భూమికంటే బరువైనది తల్లి. ఆకాశం కన్నా ఉన్నతుడు తండ్రి. ఒక్కసారి తల్లిదండ్రులకు నమస్కరిస్తే గోవును దానం చేసిన ఫలం దక్కుతుందన్నారు. సత్యం తల్లి జ్ఞానం తండ్రి. పదిమంది ఉపాధ్యాయుల కంటే ఒక ఆచార్యుడు గొప్పవాడు. వంద మంది ఆచార్యుల కంటే తండ్రి గొప్పవాడు. ఆ తండ్రికంటే వేయి రెట్లు గొప్పది జన్మనిచ్చిన తల్లి. వారికి సేవ చేస్తే ఆరుసార్లు భూప్రదక్షిణ, వెయ్యిసార్లు కాశీయాత్ర, వందసార్లు సముద్ర స్నానం చేసిన ఫలమూ దక్కుతాయి. ఈ విషయానికి భావితరాలకు గుర్తు పెట్టుకోవాలనే ఉద్దేశ్యం పాద పూజా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎమ్.వి.నరేష్, రీజినల్ ఇన్చార్జ్ రమణ, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వెంకటరమణ, డీన్ దత్తు, అసిస్టెంట్ డీన్ శ్రీనివాస్, ఏవో ప్రకాష్, పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పి కొట్టండి : కె.కె.రాజు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె.కె.రాజు గురువారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సోషల్ మీడియా మరియు ఐటీ విభాగం సైనికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధి లో ఆంధ్ర రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తుంటే అది ఓర్వలేక అన్ని పార్టీలు ఒకటై ఎల్లో మీడియా తో జత కట్టి జగన్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ విష ప్రచారం చేస్తున్నారు అని వాటిని తిప్పి కొట్టవలిసిన బాధ్యతా సోషల్ మీడియా సైనికులుగా మీ అందరి బాధ్యత అని అంటే కాకుండా గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కులాలకు, మతాలకు అతీతంగా రాజకీయంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత కూడా వైస్ జగన్మోహన్ రెడ్డిదే అని కాబట్టి ఇటువంటి నాయకుడుకి అండగా ఉండి సోషల్ మీడియా ఫ్రెట్ ఫామ్‌లో జగన్ అన్న చేస్తున్న మంచిని ప్రజలకు తెలిసే విధముగా అందరూ పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా ఐటి విభాగం ఉపాధ్యక్షుడు సూర్య విశాఖ జిల్లా సోషల్ మీడియా కో-కన్వీనర్ సదరం జ్ఞానేస్, విశాఖ ఉత్తర నియోజకవర్గం సోషల్ మీడియా కో - కన్వీనర్లు డానియల్, భాదర్ మరియు వార్డు సోషల్ మీడియా కన్వీనర్లు నియోజకవర్గ సోషల్ మీడియా సైనికులు తదితరులు పాల్గొన్నారు.

## డైట్ కళాశాలలో పేటెంట్‌లపై సెషన్

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) అటానమస్ కళాశాలనందు ఇన్స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ మరియు డైట్ ఆర్ అండ్ డి సెల్ అనుబంధంగా డైట్ స్టూడెంట్ చాప్టర్ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌లో పేటెంట్‌లపై స్వీయ-అధారిత సెషన్ నిర్వహించారు. ఈ సెషన్ రిసోర్స్ పర్సన్ ఎంఆర్‌టిఎస్‌జి గుప్తా పేటెంట్ ప్రాముఖ్యతను వివరిస్తూ ఈ సెషన్ యొక్క లక్ష్యం పేటెంట్ల పాత్రపై అంతర్ దృష్టిని అందించడం అని తద్వారా అవిష్కరణలను ప్రోత్సహించడం, ప్రస్తుత వ్యాపార రంగంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు అవకాశాల గురించి చర్చించారు. మేధో సంపత్తిని రక్షించడంలో మరియు అవిష్కరణలను ప్రోత్సహించడంలో పేటెంట్ల యొక్క పాత్రను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ పేటెంట్లు అవిష్కర్తలకు వారి అవిష్కరణలకు ప్రత్యేక హక్కులను మంజూరు చేసే చట్టపరమైన సాధనాలుగా పనిచేస్తాయి, తద్వారా పరిశోధన మరియు అభివృద్ధిలో పెట్టుబడిని ప్రోత్సహిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠ రావు, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఏ. దేవి ప్రసాద్, డైట్ IE(I) స్టూడెంట్ చాప్టర్ కన్వీనర్ హేమంత్ కుమార్ మరియు డిపార్టుమెంట్ ఆర్ అండ్ డి కోఆర్డినేటర్ వివి ప్రసన్నకుమార్‌తో పాటు సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సీటు రాకపోతే పార్టీ మారుతారు - గంటా వ్యాఖ్యలు



ఏపీలో ఎన్నికల వేళ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. సీట్ల ఖరారు వేళ సీనియర్లలో ఉత్కంఠ పెరుగుతోంది. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ముఖ్య నేతల సీట్లు గల్లంతు అవుతున్నాయి. మరి కొందరికి నియోజకవర్గాల మార్పు ఖాయంగా కనిపిస్తోంది. ఈ సమయంలోనే టీడీపీ సీనియర్ నేత గంటా శ్రీనివాస రావును విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని పార్టీ సూచించింది. దీని పైన గంటా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

**గంటా వ్యాఖ్యలు :** గంటా శ్రీనివాసరావు తన మనసులో మాట బయట పెట్టారు. చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని పార్టీ తనకు సూచించిందని చెప్పుకొచ్చారు. తనకు విశాఖ జిల్లా నుంచి పోటీ చేయాలని ఉందని స్పష్టం చేసారు. తాను ఇంతకాలం విశాఖ, అనకాపల్లి పరిధిలో ఎక్కడ పోటీ చేసినా గెలుస్తు వచ్చానని గుర్తు చేసారు.

ఇప్పుడు చీపురుపల్లి 150 కిలో మీటర్ల దూరంలో ఉందన్నారు. పార్టీ ఆలోచించి తన నిర్ణయం చెప్పమందని చెప్పుకొచ్చారు. తాను తన మద్దతు దారులు, కార్యకర్తలతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేసారు. చీపురుపల్లిలో మంత్రి బొత్సా పైన పోటీ కోసం తనను అక్కడకు పంపాలని పార్టీ భావిస్తుందని వివరించారు. పరోక్షంగా గంటా పార్టీ ప్రతిపాదనకు సుముఖంగా లేనన్నే సంకేతాలు ఇచ్చారు.

**సీటు మార్పు ఖాయమా :** ఇదే సమయంలో సీట్లు రాని వారు పార్టీ మారటం సహజమని చెప్పుకొచ్చారు. వైసీపీలో నేతల పార్టీ మార్పు అంశాన్ని ప్రస్తావించారు. టీడీపీలో సీటు లేదని చెప్పటంతోనే కేశినేని శ్రీనివాస్ పార్టీ వీడారని గంటా చెప్పుకొచ్చారు. వైసీపీకి మద్దతుగా నిలిచిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పార్టీ వీడారని ఎంపీ సీటు ప్రతిపాదించిన ఆదిమూలం వద్దని పార్టీ నుంచి బయటకు వచ్చారని గంటా చెప్పుకొచ్చారు.

టీడీపీ మరో వారం రోజుల్లో అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉందన్నారు. రెండు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు వ్యవహారం చర్చల దశలోనే ఉందని తుది నిర్ణయం జరగలేదన్నారు. తాను విశాఖ నుంచే పోటీ చేయాలని భావిస్తున్నట్లు గంటా పరోక్షంగా వెల్లడించారు. సీటు రానప్పుడు పార్టీ మారటం పెద్ద విషయం కాదంటూ గంటా చేసిన వ్యాఖ్యల పైన భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**గంటా నిర్ణయం ఏంటి :** గంటా చాలా కాలంగా విశాఖ నుంచే గెలుస్తూ వచ్చారు. 1999లో అనకాపల్లి ఎంపీగా గెలిచిన గంటా 2004లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2009లో ప్రజారాజ్యం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పని చేసారు. చిరంజీవితో గంటాకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. 2014లో టీడీపీలో చేరి భీమిలి ఎమ్మెల్యేగా గెలుపొంది చంద్రబాబు మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రి గా వ్యవహరించారు.

2019 ఎన్నికల్లో విశాఖ నార్త్ నుంచి గెలుపొందారు. ఇప్పుడు పొత్తుల్లో భాగంగా విశాఖ నార్త్ బీజేపీకి వెళ్లనుంది. దీంతో, టీడీపీ నుంచి చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని గంటాకు సూచించారు. గంటా భీమిలి నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. దీంతో, గంటా పార్టీ సూచన పైన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారుతోంది.

## నూతన సామాజిక భవనం ప్రారంభోత్సవం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ ఉత్తర నియోజకవర్గం 43వ వార్డు వెంకటేశ్వర కాలనీ ప్రాంతంలో 57 లక్షల 70వేల రూపాయల వ్యయంతో 2500 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన నూతన సామాజిక భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం జీవీఎంసీ 43వార్డు కార్పొరేటర్ పి.ఉషాశ్రీ అధ్యక్షతలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు పాల్గొని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ వై.యస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా భాధ్యతలు స్వీకరించిన తరువాత ప్రజలకు సంక్షేమ ఫలాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా మౌలిక వసతులు కూడా కల్పిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నారని అలాగే ప్రజలకు అన్ని విధాల అందుబాటులో ఉండే విధంగా అంగనవాడి కేంద్రాలు మరియు సామాజిక నూతన భవనాలను కూడా నిర్మిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, కాయల శ్రీనివాస్, కాయల పోలీస్, ఠాగూర్, సురాబత్తుల తిరుపతి, బైరా వెంకట్, బాధ శ్రీనివాస్, సిర్రా లక్ష్మణ్, కంచు పద్మశేఖర్, మట్టా రాణి, బంగారమ్మ, కోలా లక్ష్మి, కుమారి, జక్కంపూడి సత్తిబాబు, నరసయ్య, కోటి, అప్పన్న, సత్తిబాబు, మన్నారావు, సతీష్, భీమా, సన్యాసిరావు, రంజాన్ వల్లి, యం.గోపి, నేతల కుమార్ స్థానిక నాయకులు సచివాలయం సిబ్బంది, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు, మహిళలు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి అమర్నాథ్ చిత్రపటాన్ని గుడ్లతో కాట్టిన టీఎన్ఎస్ఎఫ్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పై మంత్రి అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో గురువారం సెవెన్ హిల్స్ సర్కిల్‌లో అమర్నాథ్ చిత్రపటాన్ని కోడిగుడ్లతో కొట్టారు. మంత్రి అమర్నాథ్‌కు వ్యతిరేకంగా టిఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ మా నాయకులు చంద్రబాబు లోకేష్‌లపై మంత్రి అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం మంత్రి అమర్నాథ్ ఒక బ్రోకరిగా అభివర్ణించారు పరిశ్రమల శాఖ మంత్రిగా అమర్నాథ్ ఎన్ని పరిశ్రమలు తీసుకుపచ్చారో చెప్పాలి తీసుకుపచ్చిన పరిశ్రమలు వద్ద నించొని సెల్ఫీ తీసుకొని పెట్టగలరా అని ఎద్దేవా చేశారు ఇది బ్రైలర్ మాత్రమే మా నాయకులపై మంత్రి అమర్నాథ్ ఇకపై వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి. అని హెచ్చరించారు జిల్లా టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు ఎస్ రతన్ కాంత్, టి ఎస్ ఎఫ్ ప్రతినిధులు బొండా రవికుమార్, పీలా అవినాష్, బొత్స ప్రవీణ్, డెక్కా ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## 90 రోజులలో నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయం 26 లక్షల 64వేలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సహాయ కమీషనర్, ఈ.ఓ బండారు ప్రసాద్, అనకాపల్లి జిల్లా దేవదాయ, ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీధర్, ధర్మకర్తల పర్యవేక్షణలో తేది 25.11.23 నుండి 22.02.24 వరకు అనగా 90 రోజులలో అమ్మవారికి హుండీల ద్వారా భక్తులు సమర్పించిన ఆదాయం లెక్కింపు జరిగింది. లెక్కింపులో నగదు రూపంలో 26లక్షల 64 వేల 970 రుపాయిలు మరియు 20 గ్రాముల 200 మిల్లి గ్రాములు బంగారం, వెండి 1 కేజి 98 గ్రాములు లభించాయి. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బుద్ధ నర్సింగరావు, పీలా లక్ష్మి శ్రీనివాసరావు, ఆడారి ఉమా శ్రీనివాసరావు, కొండూరి రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ సన్నిబాబు, కంటపల్లి శోభారాణి వెంకటరావు, మళ్ళవరపు ఈశ్వర్రావు, అర్చకులు యానమండ్ర శ్రీనివాసరావు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

# పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

**విజయనగరం:** పదోతరగతి, ఇంటర్ తదితర పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేసి, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు. తాడేపల్లి లోని విద్యా శాఖ కార్యాలయం నుంచి ఇంటర్మీడియట్, 10వ తరగతి, డీఎస్సి, టెట్ పరీక్షలపై జిల్లా కలెక్టర్లలతో, స్కూల్ ఎడ్యుకేషన్ కమీషనర్ సురేష్ కుమార్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమీషనర్ సౌరభ్ గౌర్, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌తో కలిసి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి బొత్స మాట్లాడుతూ రానున్నది పరీక్షల కాలమని, అధికారులంతా అప్రమత్తంగా విధులను నిర్వహించాలని ఆదేశించారు. మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్ పరీక్షలకు, మార్చి 18వ తేదీ నుంచి నిర్వహించే పదవ తరగతి పరీక్షల కోసం ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే ఈ నెల 27 నుంచి టెట్, మార్చి 15 నుంచి డీఎస్సి జరుగుతాయని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ఈ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. మరోవైపు ఎన్నికల ప్రక్రియ కూడా ప్రారంభం కాబోతుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించడంతో పాటు, స్పాట్ వేల్యూయేషన్‌కు కూడా కలెక్టర్లు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ, నిరంతరం ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని మంత్రి కోరారు.

వివిధ శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులు మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసి పరీక్షలను తనిఖీ చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా జరగాలని, ఫ్యాన్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ బస్సులతో రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్షలు జరిగే రోజు 100 మీటర్లలోపు ఉండే జిరాక్స్ సెంటర్లను బంద్ చేయించాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాలలో ఫస్ట్ ఎయిడ్ కిట్‌లో పాటు ఒక నర్సును ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలను సెల్ ఫోన్ ఫ్రీ జోన్‌గా ప్రకటించడం జరిగిందని, సిబ్బంది కూడా సెల్‌ఫోన్‌లను ఉపయోగించరాదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రానికి వెళ్లే ముందు అమ్మాయిలను మహిళా పోలీసులు తనిఖీ చేయాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకొనే విధంగా బస్సులను ఏర్పాటు చేయాలని, హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచిత ప్రయాణానికి అనుమతించాలని సూచించారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాలుగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్లను, ఇతర అధికారులను ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్ జిల్లా నుంచి కలెక్టర్ నాగలక్ష్మి, డిఇఓ ఎన్. ప్రేమ్‌కుమార్, డివిఇఓ భీమశంకర్, ఆర్‌ఐఓ మజ్జి అడినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఏయూ తెలుగు విభాగంలో మాతృభాష పై అంర్జాతీయ సదస్సు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగం & సమైక్య భారతి మరియు ఆంధ్ర భవన్ (ప్రైమరీ & హయ్యర్ సెకండరీ స్కూల్) సంయుక్త నిర్వహణలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం - తెలుగు భాషా విశిష్టత అనే అంశం పై తెలుగు విభాగ సమావేశ మందిరంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సభకు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఆర్ట్స్ & కామర్స్ కాలేజ ప్రిన్సిపాల్ ఆచార్య ఏ నరసింహారావు, విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య యం జేమ్స్ స్టీఫెన్, గౌరవ అతిథిగా హైదరాబాద్ రచన జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ రేవూరు ఉమామహేశ్వరావు, ఆత్మీయ అతిథులు గా సమైక్యభారతి జాతీయ సమన్వయకర్త పి కన్నయ్య, గిడుగు నాగేశ్వరరావు సదస్సు సమన్వయకర్త డా॥ బూసి వెంకటస్వామి హాజరయ్యారు. ముఖ్య అతిథి ఆర్ట్స్ & కామర్స్ కాలేజ ప్రిన్సిపాల్ ఆచార్య ఏ నరసింహారావు మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను మాతృభాషా ద్వారానే కాపాడుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య యం జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ కేవలం మార్కుల కోసమే తెలుగు భాషను చదువుకోకూడదని మానవ వ్యక్తిత్వ వికాసానికి మాతృభాష దోహద పడుతుందని విద్యార్థులు దీనిని గుర్తెరిగి చదువు కోవాలన్నారు. మాతృభాష మనోవికాసాన్ని పెంపొందించే మహత్తర రసగుళికన్నారు.

గౌరవ అతిథి హైదరాబాద్ రచన జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ రేవూరు ఉమామహేశ్వరావు మాట్లాడుతూ తెలుగు చదివిన వారికి ఉద్యోగావకాశాలు ఇబ్బడిముబ్బడిగా ఉన్నాయని అయితే తప్పులు లేని తెలుగు కావాలన్నారు. మన సంస్కృతి దాదాపు ఐదు వేల సంత్సరాల క్రితమే ఆరంభమైనదని అప్పుడే మాతృ భాష పరిరక్షణ జరిగిందన్నారు. రాజులు రాజ్యాలు ఏలినా భాష మనుగడ సాగించబట్టి ఈ రోజు తెలుగు అజంతంగా ఉందన్నారు ఒక చిన్న విషయాన్ని పెద్దలు చెబితే అందులో మర్మాన్ని గ్రహించకుండా విమర్శకు పూనుకోవటమే సమస్యలకు మూలమౌతుందన్నారు. అది మాతృ భాషల విషయంలోను జరిగిందని అలా కాకుండా శ్రద్ధతో విషయాన్ని ఆకళింప చేసుకుంటే మూలం తెలుస్తుందన్నారు. సదస్సు సమన్వయ కర్త డా॥ బూసి వెంకటస్వామి నివేదిక సమర్పిస్తూ ఈ సదస్సుకు వివిధ ప్రాంతాల నుండి సలభై రెండు మంది పరిశోధన పత్రాలు సమర్పించారని సదస్సు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తెలుగు సీనియర్ ఆచార్యులు ఆచార్య వెలమల సిమ్మన్న, సమైక్య భారతి జాతీయ సమన్వయ కర్త పి కన్నయ్య, డా॥ బూసి వెంకటస్వామి, డా॥ కె రత్నశేఖర్, డా॥ పెండ్యాల లావణ్య, డా॥ ఏ వెంకటేశ్వర్లు పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులపై కాల్పులు జరపడం హేయమైన చర్య: సీఐటీయూ

**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలంలో అనకాపల్లి రైతు సంఘం ఆధ్వర్యంలో గతవారం రోజులుగా దేశ రైతాంగం, రైతులు పండిస్తున్న పంటలకు మద్దతు ధరలు చట్టం చేయాలని, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను వ్యతిరేకంగా రైతులు చేసిన పోరాటం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఢిల్లీ ఛలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రైతులు ఢిల్లీ ఛలో వెళ్ళకుండా రైతులను అడ్డు కోవడానికి కేంద్ర, హర్యానా రాష్ట్ర బిజెపి ప్రభుత్వాలు శతవిధాలా ప్రయత్నిస్తున్నా, అందులో భాగంగా పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో హరియానా పోలీసులచే రైతులపై దాడి చేయించి, బాష్పవాయువు గోళాలు విసిరేసి, రబ్బరు బుల్లెట్లు తో కాల్పుడం జరిగింది. ఈ కాల్పులు సందర్భంగా రైతు శుభకరణ సింగ్‌కు రబ్బరు బుల్లెట్లు తగిలి తీవ్రంగా గాయపడి మరణించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం, హర్యానా బిజెపి ప్రభుత్వాలు 21 సంవత్సరాల యువ రైతును బలి తీసుకున్నారు అనేక మంది రైతులు గాయపడ్డారు రైతు ఉద్యమం పట్ల కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంకుశ వైఖరికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నక్కపల్లిలో నిరసన తెలిపారు ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు రైతులపై పోలీసులు కాల్పులు చేసిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముఖ్యంగా రైతులు పండించే అన్ని పంటలకు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సిఫారసు మేరకు మద్దతు ధర ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని ఒక పర్యాయం మాఫీ చేసి ఆత్మహత్యలను అరికట్టాలని పార్లమెంట్లో ప్రవేశపెట్టిన విద్యుత్‌బిల్లులో 2020ను ఉపసంహరించు కోవాలని గత రైతు ఉద్యమం సందర్భంగా మరణించిన అమర వీరులకు కుటుంబాలకు చెల్లించాలని రైతు ఉద్యమంలో రైతు నాయకుల పై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ రైతాంగం రైతు ఉద్యమం పట్ల బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గమైన వైఖరికి ఇది నిదర్శనం అన్నారు. యువరైతు మృతికి కారణమైన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకొని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది. ఈ ఉద్యమ సందర్భంగా ఇప్పటికే ఇద్దరు రైతులు గుండె ఆగి మరణించారు. కేంద్ర ప్రభుత్వం యొక్క ఈ రైతు వ్యతిరేక వైఖరిని ఖండిస్తూ నక్కపల్లిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో దోనిపాని లక్ష్మీపురం మాజీఎమ్పిటీసి గింజాల వెంకట రమణ, గరికిన చిట్టిబాబు కిల్లాడ సింహాచలం కిల్లాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ప్రారంభమైన శ్రీ మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టులోని విజయరామరాజుపేటలో వేంచేసి ఉన్న శ్రీ మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం ఉదయం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారి పండగ సందర్భంగా వేకువ జాము నుండి భక్తులు ఆలయానికి బారులు తీరి అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు మొక్కులు తీర్చుకున్నారు. పండగ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 117 సంవత్సరాల చరిత్ర కలిగిన అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా అమ్మవారి ఆలయానికి పట్టణాలను ప్రముఖులు తాకిడి పెరిగింది. అమ్మవారిని దర్శించుకున్న వారిలో జీవీఎంసీ మేయర్ గొల్ల గాని హరి వెంకట కుమారి దంపతులు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, వైట్ ఇంజనీరింగ్ కళాశాల వైర్మన్, తెలుగుదేశం విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, డాక్టర్ కే నారాయణ రావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, వైకాపా జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, శ్రీ భోగ లింగేశ్వర స్వామి ఆలయం వైర్మన్ అళ్ల నాగేశ్వరరావు, వైకాపా 80వ వార్డు ఇంచార్జ్ కొణతాల భాస్కర్, తెలుగుదేశం పార్టీ నాయకులు మల్ల సురేంద్ర, కోలారపు త్రినాథ, కుప్పిలి జగన్మోహన్‌రావు, కాంత్రేగుల సత్య నారాయణ తదితరులు ఉన్నారు. ఆలయానికి వచ్చిన ముఖ్య అతిథులను ఆలయ కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. అలాగే ప్రముఖ శిల్పి విల్లూరి పరమేశ్వరరావు దంపతులను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. జాతర సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర భక్తి రంజని కార్యక్రమంలో గాయని ఇ. నిర్మల ఆలపించిన భక్తి గీతాలు భక్తులను పారవశ్యంలో ముంచెత్తాయి. మరిడిమాంబ నగర్ లక్ష్మి గణపతి యూత్ భక్తులకు చక్కెర పొంగలి ప్రసాద వితరణ గావించారు. జాతరలో కోలాటకాలు చిటికెలు భజనలు తప్పెటగుళ్ళు తదితర నేలవేషాలు ఆకట్టుకున్నాయి. రాత్రి 7 గంటల నుండి ఆలయ పరిసర ప్రాంతాల్లో డాన్స్ బేబీ డాన్స్, ఆర్కెస్ట్రాలు, బుర్రకథలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారని ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అళ్ల శివరామ సత్యనారాయణ, పలకా రాము తెలిపారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర మహోత్సవం ఏర్పాట్లను ఘనంగా నిర్వహించారు.

# హైదరాబాదులో పలు బ్లడ్ బ్యాంకులపై డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు

హైదరాబాదులోని పలు బ్లడ్ బ్యాంకులపై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు నిర్వహించారు. సికింద్రాబాద్, మెహదీపట్నం, మల్కాజ్‌గిరి, హిమాయత్ నగర్, లక్కీకాపూల్, మలకపేట్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురిలోని 9 బ్లడ్ బ్యాంకుల్లో డ్రగ్ కంట్రోల్ బ్యూరో అధికారులు తనిఖీలు చేపట్టారు.

కొన్ని బ్లడ్ బ్యాంకుల్లో ప్రమాణాలకు తిలోదకాలిచ్చి నాసిరకం వస్తువులు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. అంతేకాదు, రక్తం సేకరించడం నుంచి పంపిణీ వరకు అనేక అవకతవకలు జరుగుతున్న విషయం గుర్తించారు.

రక్తం సేకరించిన తర్వాత అందులోని ప్లేట్ లెట్లు, ప్లాస్మా నిల్వ చేసే సమయంలో లోపాలు ఉండడం వల్ల, ఆ రక్తం ఎక్కించిన రోగులకు పలు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తరచుగా ఫిర్యాదులు వస్తున్నాయి.

ఈ నేపథ్యంలోనే డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేసినట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో పలు బ్లడ్ బ్యాంకులకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

**అధికారులు దాడులు చేసిన బ్లడ్ బ్యాంకులు**

1. శ్రీ బాలాజీ బ్లడ్ సెంటర్ (మల్కాజ్ గిరి) 2. ఎంఎస్ఎన్ బ్లడ్ సెంటర్ (ఉప్పల్) 3. నవజీవన్ బ్లడ్ సెంటర్ (చైతన్యపురి) 4. నంది బ్లడ్ సెంటర్ (బాలానగర్) 5. ఏఏఎస్ బ్లడ్ సెంటర్ (లక్కీకాపూల్) 6. వివేకానంద బ్లడ్ సెంటర్ (మెహదీపట్నం) 7. రుధిర వాలంటరీ బ్లడ్ సెంటర్ (హిమాయత్ నగర్) 8. తలసేమియా రక్షిత బ్లడ్ సెంటర్ (కోఠి) 9. ప్రతిమ సాయి బ్లడ్ సెంటర్ (సికింద్రాబాద్)


Sugar Free Fitearly | సడిపయస్సులకు దివ్య శక్తి ఫిట్ ఎర్లీ | शकवट से सक्कर उपसमन फिट एर्ली

వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?

మందులు మింగలేక, చక్కెరతో కూడిన ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?

దిగులు చెందకండి.

"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.

సోయప్రోటీన్, వే ప్రోటీన్, బ్రాహ్మి, హరితకి, సీ భక్తారస్, శొంఠి, తులసి, అశ్వగంధ

తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ట వన మూలిక సమ్మిశితమైన "ఫిట్ ఎర్లి" విశిష్టానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరీక్షించబడి సంతృప్తి కరమైన ఫలితాలను ప్రకటించు కోబడిన ఉపహారం

ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి

ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179

ఈ-మెయిల్: surampudi43@gmail.com

HERBINDO LABS PRIVATE LIMITED HEALTH AND HAPPINESS

Compli

HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa, Street No 16, Amberpet, Hyderabad - 500013, Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052

# 25 న శ్రీకృష్ణ దేవరాయ, రంగా విగ్రహాల ఆవిష్కరణ

## 2 కోట్లతో కాపు కళ్యాణ మండపం పనులు

### ఆడారి ఆనంద్ అభినందన సభ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గోపాలపట్నం పద్మ నాభనగర్‌లో ఈ నెల 25న ఆదివారం శ్రీ కృష్ణ దేవరాయ, రంగవీటి మోహనరంగా విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని శ్రీ కృష్ణ దేవరాయ కాపు, తెలగ, బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు గంధ్రెడ్డి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కంపర సత్తి బాబులు తెలిపారు. పశ్చిమ నియోజక వర్గం 92వ వార్డ్ పద్మనాభనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న కాపు కల్యాణ మండపంకి సుమారు 2 కోట్ల రూపాయల నిధులుని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తో మంజూరు చేయించి కాపులు అభివృద్ధికి ఎంతో సహకరిస్తున్న ఆదారి ఆనంద్ కుమార్‌కి అభినంద సభ అక్కడే ఏర్పాటు చెయ్యడం జరిగింది అని వీరు వెల్లడించారు. ఈ మేరకు డాబాగార్డెన్స్ విజేఎఫ్ క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో వీరు మాట్లాడారు. సంఘం గౌరవ సలహాదారు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, అధిక సంఖ్యలో వున్న కాపుల కోసం ఇప్పటికే కమ్యూనిటీ హాలు నిర్మించామన్నారు. ఎన్ ఎ డి కొత్త రోడ్డులో డాక్ యార్డ్ కేటీబీకళా క్షేత్రంలో తన స్వంత నిధులతో ఒక అంతస్తు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఈ భవనం గోపాల పట్నంలో రూ.2 కోట్లతో కళ్యాణ మండపం నిర్మాణం జరుగుతుంది అన్నారు. గతంలో 50 లక్షలు మంజూరులో జాప్యము జరిగింది అన్నారు. ఇవి ఈ ప్రాంత ప్రజలకు పూర్తిగా ఉపయోగంలోకి వస్తాయన్నారు.

అధ్యక్షుడు గంధ్రెడ్డి సత్యనారాయన మాట్లాడుతూ, విగ్రహాలు ప్రారంభము ఆదివారం జరుగుతుంది అని తెలిపారు. వైసీపీ ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ వైవి. సుబ్బారెడ్డి, బొత్స ఝాన్సి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జియ్యని శ్రీధర్, బెహరా భాస్కర్ రావు తదితరులు హాజరు కానున్నట్లు చెప్పారు.

ప్రధాన కార్యదర్శి కంపర సత్తి బాబు మాట్లాడుతూ, 2018 లో శంఖుస్థాపన చేసినా కాపు భవన్ నిర్మాణం జరగలేదని, కార్పొరేటర్ బెహరా భాస్కరావు సహకారంతో ఆదారి ఆనంద్‌తో చర్చించి ప్రభుత్వ నిధులు మంజూరు చేయించారు అని ధన్యవాదాలు తెలిపారు.

తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు కె.కోటేశ్వర రావు మాట్లాడుతూ రెండు విగ్రహాల ఆవిష్కరణ జరుగుతుంద న్నారు. విగ్రహ దాతలు సురేష్, శ్రీధర్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

మీడియా సమావేశంలో సంఘం నాయకులు ఏం.రాజశేఖర్, కే. నాగరాజు, డి.మోహన్, గేదల మురళి కృష్ణ, జి. నాగ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో భారత ఉప రాష్ట్రపతికి ఘన స్వాగతం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మిలాన్ - 2024 వేడుకల్లో భాగస్వామ్యమయ్యేందుకు విశాఖ వచ్చిన భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌కు ఐ.ఎన్.ఎస్. డేగాలో అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. మిలాన్ - 2024 వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఆయన గురువారం ఉదయం 10.22 గం.లకు ప్రత్యేక విమానంలో ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్నారు. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ జాపికను, పుష్పగుచ్ఛాన్ని అందజేసి, దుశ్శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు.

అలాగే ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, తూర్పు నావికాదళ అధికారి వైస్ అడ్మిరల్ రాజేష్ పెండార్కర్, అరకు పార్లమెంట్ సభ్యుడు గొడ్డేటి మాధవి, జిల్లా కలెక్టర్ డా॥ ఎ. మల్లికార్జున, అడిషనల్ డీజీ (గ్రేహౌండ్స్) ఆర్.కె. మీనా, పోలీస్ కమిషనర్ ఎ. రవిశంకర్, నేవీ కమోడోర్ దిలీప్ సింగ్ తదితరులు ఉప రాష్ట్రపతికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. శాసన సభ్యులు పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు), జాయింట్ పోలీస్ కమిషనర్ డా. కె. వక్కిరప్ప, అడిషనల్ సీపీ ఆనంద్ రెడ్డి, జడ్పీ సీఈవో ఎం. పోలినాయుడు, రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

**భారత ఉప రాష్ట్రపతికి ఆత్మీయ వీడ్కోలు**

భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌కు ఐ.ఎన్.ఎస్ డేగాలో రాష్ట్ర గవర్నర్, నేవీ అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

గురువారం మిలాన్ వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన మధ్యాహ్నం 12.30 గం.లకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్నారు. అక్కడ ఉప రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, తూర్పు నావికాదళ అధికారి వైస్ అడ్మిరల్ రాజేష్ పెండార్కర్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలు నాయుడు, శాసన సభ్యులు పిజివిఆర్ నాయుడు (గణబాబు), పోలీస్ కమిషనర్ డా.ఎ.రవిశంకర్, నేవీ కమోడోర్ దిలీప్ సింగ్, చీఫ్ ఆఫ్ స్టాఫ్ సమీర్ సక్సెనా, రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్ తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ఉప రాష్ట్రపతి భారత వైమానిక దళ ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 12.42 గం.లకు ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు.

# పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రజలకు ఆహ్లాదం కల్పించేందుకు పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. గురువారం ఆమె గాజువాక 87వ వార్డ పరిధిలోని అమరావతి మదర్ థెరిస్సా వాకర్స్ మహాత్మా గాంధీ పార్కులతోపాటు తిరుమల నగర్ చిల్డ్రన్ పార్కుల అభివృద్ధి పరిచేందుకు సుమారు రూ. 50.70 లక్షల వ్యయంతో గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, వార్డు కార్పొరేటర్ బోండా జగన్నాథం, జోనల్ కమిషనర్ బంటు సన్యాసినాయుడు, గాజువాక నియోజకవర్గం ఉరుకూటి చందు, వైయస్సార్సీపి వార్డ్ ఇంచార్జ్ శ్రీనుతో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ప్రతి వార్డులో ప్రజలకు ఆహ్లాదం కల్పించేందుకు పార్కులను అభివృద్ధి పరచడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో విశాఖ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. 87వ వార్డులో సుమారు 51 లక్షల రూపాయలతో తిరుమల నగర్ అమరావతి పార్కు, మదర్ థెరిసా పార్కు, వాకర్స్ పార్కు, మహాత్మా గాంధీ పార్కులను అభివృద్ధి తోపాటు సీసీ డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణాన పనులు చేపట్టేందుకు శంకుస్థాపన చేసామన్నారు .

అనంతరం గాజువాక శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో విశాఖ నగరం ఎంతో అభివృద్ధి సాధించిందని, గాజువాక ప్రాంతానికి కోట్లాది రూపాయలు వెచ్చించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రానున్న రోజుల్లో గాజువాక అభివృద్ధికి మరిన్ని నిధులు వెచ్చించి ప్రతి వార్డును ఒక మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, ఇతర వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 24, 25 తేదీల్లో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల జిల్లా పర్యటన

**విజయనగరం:** భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడి ఘంటం శ్రీనరసింహ, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ సహా పలువురు హైకోర్టు న్యాయమూర్తులు ఫిబ్రవరి 24, 25 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. వారితో పాటు రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ యు. దుర్గాప్రసాద రావు, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు కూడా జిల్లాలో పర్యటిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు.

జిల్లా జడ్జి వెల్లడించిన పర్యటన కార్యక్రమం ప్రకారం ఈనెల 24న మధ్యాహ్నం 2.45 గంటలకు న్యాయ మూర్తులు విశాఖ నుంచి బొబ్బిలి చేరుకొని మధ్యాహ్నం 3.00 గంటలకు రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నాలుగు కోర్టు భవనాల సముదాయానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం 4 గంటలకు వేణుగోపాల స్వామి ఆలయాన్ని న్యాయమూర్తులు దర్శిస్తారని వెల్లడించారు. సాయంత్రానికి విజయనగరం చేరుకుంటారు.

25న ఆదివారం ఉదయం 9.30 గంటలకు విజయనగరంలో రూ.99.2 కోట్లతో నిర్మించనున్న జిల్లా కోర్టు భవనాల సముదాయానికి శంఖుస్థాపన చేయనున్నారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడనున్నారు. మధ్యాహ్నం 1.00 గంటకు విజయనగరం నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటారని తెలిపారు.

# మరిడిమాంబను దర్శించుకున్న కోటపాడు జడ్పిటిసి అనురాధ

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలోని విజయరామరాజుపేట శ్రీ మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా గురువారం డిప్యూటి సీఎం బి.ముత్యాల నాయుడు కుమార్తె, కోటపాడు జడ్పిటిసి అనురాధ అమ్మవారిని దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆమెను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆమెతో పాటు రాష్ట్ర వైఎస్ఆర్ యువజన విభాగం కార్యదర్శి పలకా రవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అళ్ళ శివరామ సత్యనారాయణ, పలకా రాము పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


విశాఖ ఆరువేల నియోగి బ్రాహ్మణ సంక్షేమ సంఘము
ఆధ్వర్యంలో
రి.నెం. 72/2016
బ్రాహ్మణ వధూ వరుల వివాహ పరిచయ వేదిక
తేది. 25-02-2024 ఉ॥ గం॥ 9.30 ని॥ ల నుండి
శ్రీ ఆశీర్వాద రైల్వే ఫంక్షన్ హాల్, ధర్మానగర్, కంచరపాలెం, విశాఖపట్నం

For Off line Registration plz Contact :
Smt. Aduri Kalyani @ 0891 - 2534289
Sri Aduri Nageswar Rao @ 7569084081
Sri S.S. Pratap @ 9912833506
Smt. Ramya Sagar @ 7899533399
Sri S.V.R. Murthy @ 9397678826
Sri B.V. Prasad @ 9848127681
Smt. Pogaru Lakshmi @ 9885710983

For On line Registration plz Contact :
Sri P. Satyanarayana @ 8885953378
Sri A. Radha Krishna @ 9490132636

Last Date for Registration : 18-02-2024



రండి! దర్శించండి!! తరించండి!!!
శ్రీ దత్తాత్రేయ స్వామి మందిరము
మొగిలిచెర్ల - నెల్లూరు జిల్లా

తేది : 24 - 02 - 2024
శనివారం మాఘమాస పౌర్ణమితిథి నాడు
శ్రీ దత్తాత్రేయ స్వామి మందిరము
మొగిలిచెర్ల
ఉ॥ గం॥9.00 నుండి
మధ్యాహ్నం గం॥12.45 నిమి॥ వరకు
శ్రీలక్ష్మీ నారాయణ హోమము
నిర్వహింపబడును.
ఈ హోమము నందు ప్రత్యక్షముగా మరియు
పరోక్షముగా పాల్గొనదలచిన భక్తులు
సంప్రదించవలసిన నెంబర్లు
9908973699 9948742865 6302616897
భక్తులెల్లరూ ఈ హోమములో పాల్గొని తరించగలరు.


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Parawada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676